


Truth of News
RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్




సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 94 | శుక్రవారం 05 సెప్టెంబర్ 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi



## ఆఫ్ఘనిస్థాన్‌లో భూకంప విలయం...

- 2,217కి చేరిన మృతుల సంఖ్య
- దాదాపు 4,000 మందికి తీవ్ర గాయాలు
- కొనసాగుతున్న సహాయక చర్యలు.. అడ్డంకిగా మారిన కొండ ప్రాంతాలు
- మళ్లీ మళ్లీ కంపిస్తున్న భూమి.. ప్రజల్లో భయాందోళనలు - 21 టన్నుల సహాయ సామగ్రితో ఆదుకున్న భారత్
- మట్టి ఇళ్ల కింద చిక్కుకుపోయిన వందలాది కుటుంబాలు

ఆఫ్ఘనిస్థాన్- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 04


ఆఫ్ఘనిస్థాన్‌లో సంభవించిన భారీ భూకంపం పెను విషాదాన్ని మిగిల్చింది. దేశ తూర్పు ప్రాంతాన్ని కుదిపేసిన ఈ ప్రకృతి విపత్తులో మరణించిన వారి సంఖ్య 2,200 దాటింది. మరో 4,000 మంది ప్రజలు తీవ్రంగా

- మిగతా 2లో..

## మా బంధం దౌత్యానికి మించినది

- సింగపూర్‌పై మోదీ కీలక వ్యాఖ్యలు
- ఏఐ, గ్రీన్ షిప్పింగ్ వంటి భవిష్యత్ రంగాల్లో సహకారం
- చెన్నైలో సింగపూర్ సహకారంతో నైపుణ్యాభివృద్ధి కేంద్రం
- వాణిజ్య ఒప్పందాల సమీక్షకు ఇరు దేశాల నిర్ణయం
- యూపీఐ-పేనౌ అనుసంధానంలో చేరిన మరో 13 భారత బ్యాంకులు

న్యూఢిల్లీ- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 04



భారత్, సింగపూర్ మధ్య సంబంధాలు కేవలం దౌత్యపరమైన అంశాలకే పరిమితం కాదని, ఇరు దేశాల భాగస్వామ్యం సాంప్రదాయ రంగాలను దాటి అత్యాధునిక సాంకేతిక రంగాల వైపు శరవేగంగా విస్తరిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్‌తో కలిసి గురువారం న్యూఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు పరస్పర ప్రయోజనాలే లక్ష్యంగా,


- మిగతా 2లో..

## బిల్లులపై వెంటనే నిర్ణయం తీసుకోవాలి

- గవర్నర్లకు మూడు నెలల కాలపరిమితి చాలా ఎక్కువ
- సుప్రీంకోర్టుకు మూడు ప్రతిపక్షపాలిత రాష్ట్రాలు వెల్లడి

న్యూఢిల్లీ- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 04

గవర్నర్లకు క్లియరెన్స్ కోసం పంపిన బిల్లులకు వెంటనే ఆమోదం తెలపాలని ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు సుప్రీంకోర్టుకు తెలిపాయి. బిల్లుల ఆమోదం కోసం ఏప్రిల్‌లో న్యాయస్థానం విధించిన మూడు నెలల కాలపరిమితి కూడా చాలా ఎక్కువేనని వివరించాయి. ఈ మేరకు పశ్చిమ బెంగాల్, కర్నాటక, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు.. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్ గవాయి, జస్టిస్ సూర్యకాంత్ మిశ్రా, జస్టిస్ విక్రమ్ నాథ్,



జస్టిస్ పి.ఎస్ నరసింహ, జస్టిస్ ఎ.ఎస్ చందుర్కార్‌లతో కూడిన ధర్మాసనానికి వాదనలు వినిపించాయి. కర్నాటక, హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్

- మిగతా 2లో..

## ఎస్ఎల్‌బీసీ పనుల్ని పునరుద్ధరించండి

- సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి
- రక్షణ చర్యలతో ముందుకే సాగాలని నిర్ణయం
- ఆర్మీ అధికారుల సేవల్ని వినియోగించుకోండి
- 2027 డిసెంబరు 9 లోపు పనులు పూర్తిచేయాలి
- అదేరోజు జాతికి అంకితం చేస్తాం



హైదరాబాద్- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 04

ఎస్ఎల్‌బీసీ పునరుద్ధరణ పనుల్ని వెంటనే ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను అదేశించారు. గత అనుభవాలు, దుర్ఘటనల్ని దృష్టిలో ఉంచుకొని కార్మికులకు పూర్తిస్థాయి

- మిగతా 2లో..



## ట్రంప్ సర్కార్‌కు ఎదురుదెబ్బ

- హార్వర్డ్‌కు నిలిపివేసిన నిధులను ఇవ్వాలని ఫెడరల్ కోర్టు ఆదేశం

వైట్‌హౌస్- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 04

హార్వర్డ్ నిధుల విషయంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌నకు ఎదురుదెబ్బ తగిలింది. యూనివర్సిటీకి అందించే 2.6 బిలియన్ డాలర్ల నిధుల నిలిపివేస్తూ ట్రంప్ సర్కార్ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఫెడరల్ కోర్టు ఆదేశించింది. హార్వర్డ్ తన పాలన విధానాల్లో మార్పు కోసం వైట్‌హౌస్ చేసిన డిమాండ్లను తిరస్కరించినందుకు ట్రంప్ సర్కార్ తీసుకున్న ప్రతీకార చర్య

- మిగతా 2లో..



## కోస్తాంధ్రకు భారీ వర్ష సూచన

- బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడే అవకాశం - ఏపీ, తెలంగాణ, కర్ణాటకలో విస్తారంగా కురవనున్న వర్షాలు
- హిమాచల్, ఉత్తరాఖండ్‌లో రెడ్ అలర్ట్ జారీ
- ఢిల్లీలో యమునా ఉగ్రరూపం.. జనజీవనం స్తంభనం - కొండ ప్రాంతాలకు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచన

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 04

కోస్తాంధ్ర, తెలంగాణతో పాటు పలు దక్షిణ భారత రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) హెచ్చరించింది. వాయవ్య బంగాళాఖాతంలో

- మిగతా 2లో..

## ఇకపై రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం

- చంద్రబాబు కేబినెట్ కీలక నిర్ణయం..
- యూనివర్సల్ హెల్త్ పాలసీకి ఏపీ కేబినెట్ ఆమోదం
- ప్రతి కుటుంబానికి ఏటా రూ. 25 లక్షల ఆరోగ్య బీమా
- రాష్ట్రవ్యాప్తంగా 1.63 కోట్ల కుటుంబాలకు లబ్ధి
- ఆరు గంటల్లోనే వైద్య చికిత్సకు అనుమతులు
- 2,493 నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సేవలు
- మొత్తం 3,257 రకాల చికిత్సలు అందుబాటులోకి



అమరావతి - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 04

ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆరోగ్య భద్రత దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం ఒక చారిత్రక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఏటా రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం అందించే 'యూనివర్సల్ హెల్త్ పాలసీ'కి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. గురువారం అమరావతిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. 'ఆయుష్మాన్ భారత్ - ఎన్టీఆర్ వైద్య సేవ' పథకం కింద

- మిగతా 2లో..



## ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేయాలి

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి
- సచివాలయం లోని చాంబర్లో ప్రజా దర్బార్ నిర్వహించిన మంత్రి - ఛాంబర్లో పలువురు ప్రముఖులతో మంత్రి సమావేశం

అమరావతి- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 04:

రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సచివాలయంలోని ఛాంబర్ లో ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు తక్షణమే ఆదేశాలు జారీ చేశారు. పలువురు ప్రముఖులతో సమావేశమైనారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన ధ్యేయమని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి



# మా బంధం దౌత్యానికి మించినది

(మొదటి పేజీ తరువాయి)

శాంతి, శ్రేయస్సు అనే ఉమ్మడి దార్శనికతతో ముందుకు సాగుతున్నాయని మోదీ అన్నారు.

సింగపూర్ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత లారెన్స్ వాంగ్ భారత్‌లో పర్యటించడం ఇదే మొదటిసారి. ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 60 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ పర్యటనకు మరింత ప్రాధాన్యత లభించింది. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, "భారత్ 'యాక్ట్ ఈస్ట్' విధానంలో సింగపూర్ ఒక కీలకమైన స్తంభం లాంటిది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం కోసం ఆసియాన్‌తో కలిసి పనిచేయడం కొనసాగిస్తాం" అని పేర్కొన్నారు. భవిష్యత్ భాగస్వామ్యం కోసం ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసినట్లు ప్రధాని వెల్లడించారు. ఇకపై సహకారం అధునాతన తయారీ, గ్రీన్ షిప్పింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్వాంటం టెక్నాలజీ, పట్టణ నీటి నిర్వహణ వంటి నూతన రంగాలకు విస్తరిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా సింగపూర్ సహకారంతో చెన్నైలో 'నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ స్కిల్లింగ్' ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ కేంద్రం ద్వారా అధునాతన తయారీ రంగంలో అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను తీర్చిదిద్దుతామని వివరించారు.

డిజిటల్ కనెక్టివిటీలో భాగంగా ఇప్పటికే విజయవంతమైన యూపీఐ-పేనౌ అనుసంధానంలో కొత్తగా మరో 13 భారతీయ బ్యాంకులు చేరినట్లు మోదీ తెలిపారు. ద్వైపాక్షిక సమగ్ర ఆర్థిక సహకార ఒప్పందంతో పాటు, ఆసియాన్‌తో ఉన్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని కూడా నిర్ణీత సమయంలో సమీక్షించాలని ఇరు దేశాలు నిర్ణయించాయని ఆయన పేర్కొన్నారు. గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీ ఇరు దేశాల స్టాక్ మార్కెట్లను కలుపుతూ ఒక వారధిగా నిలుస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ఆగ్నేయాసియాలో సింగపూర్ భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అని, రక్షణ సంబంధాలు కూడా రోజురోజుకు బలపడుతున్నాయని ఆయన గుర్తు చేశారు.

# కోస్తాంధ్రకు భారీ వర్ష సూచన

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రీకృతమైన అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారనుందని, తీర ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.ఐఎండీ గురువారం విడుదల చేసిన బులెటిన్ ప్రకారం, కోస్తాంధ్ర, తెలంగాణ, దక్షిణ ఒడిశా, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌తో పాటు కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉంది. ఇదే సమయంలో కొంకణ్, గోవా, మహారాష్ట్రలోని ఘాట్ ప్రాంతాలు, కోస్తా కర్ణాటకలో సెప్టెంబర్ 7 వరకు అతి భారీ వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మరోవైపు, దేశంలోని ఉత్తర, మధ్య భారతంలోనూ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు ఐఎండీ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈ ప్రాంతాల్లో కుండపోత వర్షాల కారణంగా వరదలతో పాటు కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. పర్యాటకులు కొండ ప్రాంతాలకు ప్రయాణాలు తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. దేశ రాజధాని ఢిల్లీని సైతం భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వానలకు యమునా నది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. నది నీటిమట్టం 207 మీటర్ల మార్కును దాటడంతో ఢిల్లీ, ఎన్సీఆర్ ప్రాంతాలకు ఆరెంజ్, యెల్లో అలర్ట్‌లు ప్రకటించారు. వరదల కారణంగా ట్రాఫిక్ జామ్‌లు, విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడి జనజీవనం స్తంభించింది. ఈశాన్య రాష్ట్రాల్లో కూడా వారం రోజుల పాటు వర్షాలు కొనసాగుతాయని ఐఎండీ పేర్కొంది. ఈ నేపథ్యంలో ప్రజలు అత్యవసరం అయితే తప్ప ప్రయాణాలు పెట్టుకోవద్దని, వాతావరణ శాఖ సందేశాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని అధికారులు సూచించారు.

## ఇకపై రూ.25 లక్షల వరకు

# ఉచిత వైద్యం

(మొదటి పేజీ తరువాయి)

ఈ కొత్త విధానాన్ని అమలు చేయనున్నారు. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని అర్హులైన సుమారు కోటి 63 లక్షల కుటుంబాలకు భారీ ప్రయోజనం చేకూరనుంది. అత్యవసర సమయాల్లో వైద్యం కోసం పేద, మధ్యతరగతి ప్రజలు అప్పులపాలు కాకుండా చూసేందుకు ఈ పథకం దోహదపడనుంది. ఈ పథకం అమలులో వేగం, పారదర్శకతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చింది. వైద్య చికిత్సలకు కేవలం 6 గంటల్లోనే అనుమతులు మంజూరు చేసేలా ప్రత్యేకంగా 'ప్రీ ఆథరైజేషన్ మేనేజ్‌మెంట్' వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 2,493 నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందుబాటులో ఉంటాయి. హైబ్రిడ్ విధానంలో మొత్తం 3,257 రకాల చికిత్సలను ఈ పథకం పరిధిలోకి తీసుకొచ్చారు. ఈ పాలసీ ప్రకారం, రూ. 2.5 లక్షల లోపు వైద్య చికిత్సల క్లెయిమ్‌లను ఇన్సూరెన్స్ కంపెనీలు పర్యవేక్షిస్తాయి. రూ. 2.5 లక్షల నుంచి రూ. 25 లక్షల వరకు అయ్యే భారీ వైద్య ఖర్చులను ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ద్వారా నేరుగా రాష్ట్ర ప్రభుత్వమే భరించనుంది. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ఈ సమావేశంలో మంత్రులతో చర్చించిన అనంతరం సీఎం చంద్రబాబు ఈ కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు.

# ఒకటికి మించి ఓటరు ఐడీ ఉంటే సరెండర్ చేయాలి

## - ఎన్నికల సంఘం

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 04**

ఓటరు కార్డులకు సంబంధించి ఎన్నికల సంఘానికి ఇటీవల ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఒకటికి మించి ఓటరు కార్డులు కలిగి ఉండటం నేరమని ఎన్నికల సంఘం పేర్కొంది. ఒకవేళ రెండు, అంతకన్నా ఎక్కువ ఉన్నట్లయితే ఒకదాన్ని మాత్రమే పెట్టుకొని, అదనపు కార్డులను సరెండర్ చేయాలని స్పష్టం చేసింది."రెండు ఓటరు కార్డులను కలిగి ఉండటం ప్రజా ప్రాతినిధ్య చట్టం-1950 ప్రకారం నేరం. సెక్షన్ 31 కింద వారికి గరిష్టంగా ఏడాది శిక్ష లేదా జరిమానా లేదా రెండూ ఉండొచ్చు. ఒకవేళ ఎవరి వద్దనైనా రెండు, అంతకంటే ఎక్కువ కార్డులు ఉంటే ఒకటి మాత్రమే తమ వద్ద ఉంచుకోవాలి" అని ఈసీ అధికారులు వెల్లడించారు. ఓటరు జాబితాలో రెండు చోట్ల ఓటరుగా ఉన్నట్లయితే.. ఒకచోట తమ పేరును తొలగించాలని కోరుతూ ఫారం-7 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందుకోసం ఆన్‌లైన్‌లోనూ వెసులుబాటు ఉంద న్నారు. బీహార్ డిప్యూటీ సీఎంతో పాటు,కాంగ్రెస్ సీనియర్ నేత, ఆ పార్టీ మీడియా-పబ్లిసిటీ సెల్ చైర్మెన్ పవన్ ఖేరాకు రెండు ఓటరు కార్డులున్నాయనే ఫిర్యాదు రావడంతో ఎన్నికల సంఘం ఇటీవల నోటీసులు జారీ చేసిన విషయం విదితమే.

## బిల్లులపై వెంటనే

# నిర్ణయం తీసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వాలు అధికారంలో ఉండగా.. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పరిపాలిస్తున్న విషయం విదితమే.
బిల్లులకు సమ్మతి తెలియజేసే విషయంలో గవర్నర్లు, రాష్ట్రపతికి సుప్రీంకోర్టు మూడు నెలల గడువు విధించటంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇప్పటికే అభ్యంతరం వ్యక్తం చేసిన విషయం విదితమే. అసలు రాష్ట్రపతికి గడువు నిర్దేశించే అధికారం న్యాయ స్థానాలకు ఉన్నదా? అని ప్రశ్నిస్తూ.. దీనిపై స్పష్టత ఇవ్వాలని సుప్రీంకోర్టుకు ముర్ము సూచించారు. దీంతో రాష్ట్రపతి రిఫరెన్స్‌పై సుప్రీంకోర్టు సీజేఐ బి.ఆర్ గవాయి నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం విచారణ ప్రారంభించింది. ఈ రిఫరెన్స్‌పై న్యాయస్థానం కేంద్రం, అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు జులైలో నోటీసులు జారీ చేసింది. అయితే రాష్ట్రపతి రిఫరెన్స్‌పై జరిగిన విచారణ సందర్భంగా ఈ మూడు రాష్ట్రాలూ తమ వాదనలను వినిపించాయి. ప్రజల అభీష్టాన్ని గవర్నర్ల ఇష్టాయిష్టాల బలిపీఠానికి వదిలేయలేమని స్పష్టం చేశాయి. గవర్నర్ వంటి ఉన్నత రాజ్యాంగ అధికారం బిల్లులను ఆమోదించే విషయంలో చిత్తశుద్ధితో వ్యవహరి స్తుందని రాష్ట్రా లు భావించాలని కేంద్రం కోరుకుంటే.. అదే మర్యాదను ఉన్నత రాజ్యాంగ అధికారం కలిగిన శాసన సభలకూ విస్తరించాలని మూడు రాష్ట్రాలు కోరాయి.

**బిల్లుల చట్టబద్ధతను పరిశీలించే అధికారం గవర్నర్‌కు లేదు : పశ్చిమ బెంగాల్**

సుప్రీంకోర్టు విచారణలో భాగంగా పశ్చిమ బెంగాల్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. రాష్ట్ర శాసన సభ ఆమోదించిన బిల్లుల చట్టబద్ధత, రాజ్యాంగబద్ధతను పరిశీలించే, ప్రశ్నించే అధికారం గవర్నర్‌కు, కేంద్రానికి లేదని చెప్పారు. ఒక చట్టం రాజ్యాంగబద్ధతలను పరీక్షించాల్సింది న్యాయ స్థానాలే అని వివరించారు. శాసన నిర్మాణంలో పార్ల మెంటుకు ఉన్న అధికారాలే రాష్ట్ర అసెంబ్లీలకూ ఉంటాయని కపిల్ సిబల్ చెప్పారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్ ఒక బిల్లుతో విభేదిస్తే.. వీలైనంత త్వరగా రాష్ట్ర శాసన సభకు తిరిగి పంపాలని చెప్పారు. సాధ్యమైనంత త్వరగా అంటే 'వెంటనే' అని అర్థం వస్తుందనీ, దీనిని గవర్నర్లు, రాష్ట్రపతికి వర్తించాలని చెప్పారు.

**కేంద్రం వాదన లోపభూయిష్టం..**
**కోర్టులే తుది మధ్యవర్తులు : కర్నాటక, హిమాచల్‌ప్రదేశ్**

అలాగే కర్నాటక తరఫున గోపాల్ సుబ్రమణ్యం, హిమాచల్‌ప్రదేశ్ తరఫున న్యాయవాది ఆనంద్ శర్మలు వాదించారు. రాష్ట్ర శాసన సభలు తమ శాసనాధి కారాలపై దాడికి అనుమతించవని సుబ్రమణ్యం చెప్పారు. రాష్ట్రపతి, గవర్నర్లకు విస్తృత విచక్షణాధికా రాలు ఉన్నాయనే కేంద్రం వాదన ప్రాథమికంగా లోపభూయిష్టంగా ఉన్నదని వాదించారు. రాజ్యాంగం విషయానికొస్తే.. కోర్టులే తుది మధ్యవర్తులనీ, అదే గణతంత్ర బలమని ఆనంద్ శర్మ కోర్టు తెలిపారు. బిల్లుల ఆమోదానికి గడువు విధించటంపై సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని రాష్ట్రపతి కోరటాన్ని వీరు వ్యతిరేకించారు. కాగా ఈ వివాదంపై తదుపరి విచారణ ఈనెల 9న మొదలవుతుంది.

## ఎస్ఎల్‌బీసీ పనుల్ని

# పునరుద్ధరించండి

(మొదటి పేజీ తరువాయి)

రక్షణ చర్యలు ఇస్తూ, పనుల్ని కొనసాగించాలని చెప్పారు. అనుభవమున్న ఆర్మీ అధికారుల సేవలను వినియోగించుకోవాలని నిర్ణయించారు. ఈ టన్నెల్ పనులు పూర్తయితే ఫ్లోరోసిస్ పీడిత నల్లగొండ జిల్లాకే కాకుండా తెలంగాణకే అత్యంత కీలక నీటి సరఫరా మార్గంగా మారుతుందని చెప్పారు. ప్రణాళిక ప్రకారం ప్రపంచ స్థాయి అత్యాధునిక సాంకేతిక నైపుణ్యంతో పనులు చేపట్టాలని నిర్ణయించారు. గురువారం సీఎం నివాసంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, సలహాదారులు అదిత్యాదాస్‌నాద్, ఇండియన్ ఆర్మీ రిటైర్డ్ ఇంజినీర్ ఇన్ చీఫ్, లెఫ్టినెంట్ జనరల్ హర్పాల్‌సింగ్, స్పెషల్ సెక్రటరీ, ఇండియన్ ఆర్మీ కల్నల్ పరీక్షిత్ మెహరా, ఈఎన్సీలు అంజత్ హుస్సేన్, ఎన్జీఆర్ఐ డైరెక్టర్ ప్రకాశ్‌కుమార్, చీఫ్ సైంటిస్ట్ హెచ్వీఎస్ సత్యనారాయణ, జీఎస్ఐ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ కేవీ మారుతి, డైరెక్టర్ శైలేంద్ర కుమర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్‌లో దేశ విదేశాల్లో చేపట్టే టన్నెల్ ప్రాజెక్ట్‌లకు ఆదర్శంగా ఉండేలా ఎస్ఎల్‌బీసీ నిర్మాణం పూర్తి చేయాలనీ, ఇదో కేస్‌స్టడీగా ఉండాలనే అకాంక్షను వెలిబుచ్చారు. ప్రభుత్వం తరఫున అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామనీ, అటవీశాఖ, ఇంధన శాఖ ఇరిగేషన్ విభాగంతో సమన్వయం చేసుకోవాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి అదేశించారు. ఎస్ఎల్‌బీసీ పునరుద్దరణ పనులకు అవసరమైన అన్ని అనుమతులు, నిర్ణయాలు తీసుకునేందుకు ఈ నెల 15లోగా క్యాబినెట్ సమావేశం ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. వెంటనే సంబంధిత విభాగాల అధికారుల స్థాయి సమావేశం ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఒక్క సమావేశంలోనే అన్ని సమస్యలకు పరిష్కారం తీసుకురావాలని నిర్ణయించారు. అటవీ శాఖ అనుమతులపైన ప్రత్యేక దష్టి పెట్టాలనీ, ఎస్ఎల్‌బీసీ పనులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరగాలన్నారు. సొరంగం తవ్వకంలో సింగరేణి నిపుణుల సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే ఎలాంటి ఖర్చు లేకుండా గ్రావిటీ ద్వారా నీళ్లు ఇవ్వడానికి అవకాశముందన్నారు. 2027 డిసెంబరు 9లోగా ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలనీ, అదేరోజు దీన్ని తెలంగాణ ప్రజలకు అంకితం చేయాలని సీఎం గడువు నిర్ణయించారు. దీనికోసం ప్రతి మూడు నెలల ప్లానింగ్ సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. సొరంగం పనులను వేగంగా పూర్తి చేసేందుకు కాంట్రాక్టు సంస్థ జేపి అసోసియేట్స్ అన్ని పరికరాలను సిద్ధం చేసుకోవాలనీ, కాంట్రాక్టు సంస్థ ఒక్క రోజు పనులు ఆలస్యం చేసినా ఒప్పుకునేది లేదన్నారు. ఇన్లెట్, ఔట్లెట్ రెండు వైపుల నుంచి పనులు చేపట్టాలనీ, అందుకు అవసరమైన యంత్ర పరికరాలతో పాటు నిపుణులు, కార్మికులను రంగంలోకి దింపాలని సూచించారు.

ఎస్ఎల్‌బీసీ పనులకు గ్రీన్‌ఛానల్‌లో నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మొత్తం 44 కిలోమీటర్ల సొరంగమార్గానికి గాను ఇప్పటికే 35 కిలోమీటర్ల సొరంగం తవ్వడం పూర్తి అయ్యిందని గుర్తుచేశారు. మిగతా తొమ్మిది కిలోమీటర్ల సొరంగ మార్గం తవ్వడానికి గాను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించబోతున్నట్టు ఈ సందర్భంగా పరీక్షిత్ మెహ్రా వివరించారు. ప్రతి నెలా 178 మీటర్ల సొరంగం తవ్వడం లక్ష్యంగా పెట్టుకుని జనవరి 2028 నాటికి పూర్తి చేయనున్నట్టు తెలిపారు ప్రపంచంలో అత్యాధునిక సాంకేతికతో కూడిన నేషనల్ జియో ఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ) ద్వారా హెలీ-బోర్న్ సర్వే నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. దీనివల్ల సొరంగం తవ్వకాల సమయంలో ముందుగానే ప్రమాదాలను పసిగట్టే వీలుంటుందని వివరించారు.

# ఆఫ్ఘనిస్థాన్‌లో భూకంప విలయం..

(మొదటి పేజీ తరువాయి)

గాయపడ్డారు. పాకిస్థాన్ సరిహద్దుకు సమీపంలో ఉన్న కునార్ ప్రావిన్స్‌లో భూకంప తీవ్రత అత్యధికంగా ఉంది. సహాయక చర్యలు కొనసాగుతున్నప్పటికీ, కొండ ప్రాంతాలు కావడంతో సహాయక బృందాలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తాలిబాన్ ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం, ఈ భూకంపంలో ఇప్పటివరకు 2,217 మంది ప్రాణాలు కోల్పోయారని, సుమారు 4,000 మంది గాయపడ్డారని డిప్యూటీ ప్రభుత్వ ప్రతినిధి హందుల్లా ఫిత్రత్ 'ఎక్స్' ద్వారా వెల్లడించారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.0గా నమోదైంది.

**మట్టి దిబ్బలుగా మారిన గ్రామాలు**

భూకంప ధాటికి అనేక గ్రామాలు పూర్తిగా నేలమట్టమయ్యాయి. మట్టి, కలపతో నిర్మించిన ఇళ్లు పేకమేడల్లా కూలిపోవడంతో వందలాది కుటుంబాలు శిథిలాల కింద చిక్కుకుపోయాయి. హెలికాప్టర్లు దిగలేని మారుమూల పర్వత ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు తాలిబాన్ అధికారులు కమాండోలను గాల్లోంచి దించుతున్నారు. ఇదిలా ఉండగా, గురువారం మరోసారి 4.8 తీవ్రతతో భూమి కంపించడం ప్రజలను మరింత భయాందోళనకు గురిచేసింది. యూఎస్ జియోలాజికల్ సర్వే ప్రకారం, మంగళవారం కూడా 5.2 తీవ్రతతో భూకంపం సంభవించింది.

**భారత్ మానవతా సాయం**

ఈ విపత్తుపై స్పందించిన భారత్, ఆఫ్ఘనిస్థాన్‌కు అండగా నిలిచింది. 21 టన్నుల సహాయ సామగ్రితో కూడిన విమానాన్ని కాబూల్‌కు పంపింది. ఇందులో టెంట్లు, దుప్పట్లు, అత్యవసర మందులు, జనరేటర్లు, నీటి ట్యాంకులు ఉన్నాయి. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని, అవసరమైన మరింత సహాయం అందిస్తామని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ తెలిపారు. యూరేషియన్, ఇండియన్ టెక్టోనిక్ ప్లేట్ల సమీపంలో ఉండటం, బలహీనమైన నిర్మాణాల కారణంగా ఆఫ్ఘనిస్థాన్‌లో తరచూ భూకంపాలు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి.

## ట్రంప్ సర్కార్‌కు

# ఎదురుదెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

అని తీర్పునిచ్చింది. యూనివర్సిటీలో యూదులపై వ్యతిరేకత విషయానికి ఈ నిధుల కోతకు సంబంధం లేదని పేర్కొంది. ఫెడరల్ నిధులను నిలిపివేయడాన్ని సమర్థించేందుకు యూదులపై వ్యతిరేకతను కవచంగా వాడారని తెలిపింది. ఇది స్పష్టమైన రాజకీయ ప్రతీకారమని వెల్లడించింది. ఈ తీర్పుతో హార్వర్డ్‌కు గణనీయమైన విజయం లభించింది. కోతల కారణంగా నిలిచిన వందలాది రీసెర్చ్ ప్రాజెక్టులకు పునర్జీవం లభించనుంది. హార్వర్డ్ యూనివర్సిటీలో జరిగే నియామక పద్ధతులు, ప్రవేశ విధానాలలో మార్పులు చేయాలని, ఫేస్ మాస్క్‌లను నిషేధించాలని ట్రంప్ నేతృత్వంలోని పరిపాలన విభాగం ఓ లేఖను పంపించింది. పాలస్తీనా అనుకూల నిరసనలను అణచివేసేందుకు ఈ నిబంధనలను జారీ చేసినట్టుగా సమాచారం. దీనిపై స్పందించిన హార్వర్డ్ విశ్వవిద్యాయలయం ప్రెసిడెంట్ అలాన్ గార్బర్ ఆ డిమాండ్లను వ్యతిరేకిస్తున్నట్టు బదులిచ్చారు. ఏ ప్రభుత్వమైనా విశ్వవిద్యాలయాల్లో ఏం బోధించాలి, ఎవరిని చేర్చుకోవాలి, నియమించుకోవాలి లేదా ఏ రంగాలను ఎంచుకోవాలో నిర్దేశించకూడదని తెలిపారు. దీనిని తీవ్రంగా పరిగణించిన ట్రంప్ ప్రభుత్వం, హార్వర్డ్‌కు అందే నిధులను స్తంభింపజేయాలని నిర్ణయించింది. పౌర హక్కులను ఉల్లంఘించారనే ఇప్పటికే కొలంబియా, పెన్సిల్వేనియాతో సహా కార్నెల్, నార్త్ వెస్ట్రన్ విశ్వవిద్యాలయాలకు అందించే నిధులను ట్రంప్ సర్కార్ నిలిపివేసింది.
ఆ తర్వాత అమెరికా ప్రభుత్వం 2025-26 విద్యా సంవత్సరం నుంచి హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో విదేశీ విద్యార్థుల ప్రవేశాలపై నిషేధం విధించింది. ట్రంప్ సర్కారు నిర్ణయం తర్వాత హార్వర్డ్ ఇకపై కొత్త విదేశీ విద్యార్థులను అడ్మిషన్లు ఉండవు. ఇప్పటికే యూనివర్సిటీలో చదవుతున్న విదేశీ విద్యార్థులు మరొక విశ్వవిద్యాలయానికి బదిలీ కావాల్సి ఉంటుంది. లేకపోతే అమెరికాను విడిచి వెళ్లాల్సి ఉంటుంది. ఈ రెండింటిలో ఏది చేయకపోయినా చట్టపరమైన చర్యలు ఉంటాయని ట్రంప్ సర్కార్ హెచ్చరించారు.

**140 కంటే ఎక్కువ దేశాల నుంచి**

అమెరికాలోని పురాతన, సంపన్న విశ్వవిద్యాలయాల్లో హార్వర్డ్‌ఒకటి. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో 140 కంటే ఎక్కువ దేశాల నుంచి ఏటా అడ్మిషన్లు పొందుతున్నారు. ఒక్క మసాచుసెట్స్‌లోని హార్వర్డ్ కేంబ్రిడ్జ్ క్యాంపస్‌లోనే దాదాపు 6,800 మంది విదేశీ విద్యార్థులు చేరుతున్నారు. వీరిలో ఎక్కువ మంది గ్రాడ్యుయేట్ విద్యార్థులే.

# సంపాదకీయం

## కుటుంబ రాజకీయాలకు బలేనా




రాజకీయం.. దాని పేరే రాజకీయం. ఎన్నో యుగాలుగా ఈ రాజకీయం రాజ్యమేలుతూ వస్తోంది. ఆధిపత్యం కోసం.. అధికారం కోసం నడిచే సమరమే రాజకీయం. ప్రజలకు సేవ చేయాలనుకునేవారు రాజకీయాల్లోకి వస్తారు. కానీ ఒక్కొక్కరిది ఒక్కో మార్గం. మనుషులను, వ్యవస్థలను, చివరకు కుటుంబాలను అడ్డగోలుగా చీల్చేస్తుంది రాజకీయం. అలనాటి గాంధీ కుటుంబం నుంచి.. తాజాగా నేటి కేసిఆర్ కుటుంబం వరకు రాజకీయ చీలికలు కొనసాగుతూనే ఉన్నాయి. తెలంగాణలో ప్రస్తుతం బీఆర్ఎస్ నుంచి కల్వకుంట్ల కవిత సస్పెండ్ కావడంతో దేశవ్యాప్తంగా చర్చ నడుస్తోంది. తెలుగు నాట నందమూరి తారక రామారావు, చంద్రబాబు, వైయస్ రాజశేఖర్ రెడ్డి, కల్వకుంట్ల చంద్రశేఖర రావు కుటుంబాల్లో సైతం చీలిక వచ్చిన విషయాన్ని ఎక్కువ మంది ప్రస్తావిస్తున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి, బిఆర్ఎస్ కు దగ్గర సంబంధాలు ఉన్నాయి. ఆ రెండు పార్టీలకు ఉమ్మడి ప్రత్యర్థి చంద్రబాబు. ఆపై కాంగ్రెస్ పార్టీ అంటే విపరీతమైన ద్వేషం. బిజెపి విషయంలో సరైన స్టాండ్ లేదు. తమ సొంత రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో రాజీ పడ్డారన్న విమర్శ అటు కెసిఆర్, ఇటు జగన్మోహన్ రెడ్డి లపై ఉంది. ముందుగా కేసిఆర్ అధికారానికి దూరమయ్యారు. తరువాత జగన్మోహన్ రెడ్డి వంతు వచ్చింది. రాజకీయంగా ఇద్దరి పరిస్థితి గడ్డు స్థితిలో ఉంది. పైగా సమీప బంధువులు, కుటుంబ సభ్యులపై అవినీతి ఆరోపణలు ఉన్నాయి. అలా సొంత కుటుంబ సభ్యులే ఈ తరహా ఆరోపణలు చేస్తున్నారు. అయితే తాజాగా తెలంగాణలో సొంత కుటుంబ సభ్యులపై విమర్శలు చేశారు కేసీఆర్ కుమార్తె కవిత. అయితే ఏపీలో సైతం జగన్మోహన్ రెడ్డి సోదరి షర్మిల సైతం ఇదే తరహా ఆరోపణలు చేశారు. దీంతో ఆ రెండు పార్టీల మధ్య భావ సారూప్యత కొనసాగుతోంది. తెలంగాణలో కెసిఆర్ కుమార్తె సొంత పార్టీ నుంచి బహిష్కరణకు గురయ్యారు. ఆమె అదే పార్టీకి చెందిన తమ సమీప బంధువు హరీష్ రావు, సంతోష్ రావులపై సంచలన ఆరోపణలు చేశారు. కాలేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భారీ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. దీంతో ఆమె పై సస్పెన్షన్ వేటు పడింది. ఆమె సైతం తాను చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నట్లు ప్రకటించారు. అయితే గత కొంతకాలంగా ఆమె సొంత కుటుంబ సభ్యులపై విరుచుకుపడుతున్నారు. అయితే హరీష్ రావు తో పాటు సంతోష్ రావులపై విమర్శలు చేయడంతో ఆమె అసలు అజెండా బయటపడింది. వారిద్దరి కారణంగానే ఆమె గత కొద్ది రోజులుగా ఇలాంటి ఆరోపణలు చేస్తున్నట్లు స్పష్టమవుతోంది.ఏపీలో సైతం హరీష్ రావు మాదిరిగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అవినాష్ రెడ్డి రూపంలో ప్రతి బంధకం ఏర్పడింది. తెలంగాణలో కెసిఆర్ ను అడ్డం పెట్టుకొని హరీష్ రావు భారీ అవినీతికి తెర తీసారని కవిత చెబుతున్నారు. అదే మాదిరిగా ఏపీలో సైతం అవినాష్ రెడ్డి జగన్మోహన్ రెడ్డిని అడ్డం పెట్టుకొని హత్య రాజకీయాలకు పాల్పడ్డారని షర్మిల ఆరోపిస్తున్నారు. వివేకానంద రెడ్డి హత్య కేసులో అవినాష్ రెడ్డి ప్రధాన నిందితుడని.. ఆయనను జగన్మోహన్ రెడ్డి కాపాడే ప్రయత్నం చేస్తున్నారని 1995లో ప్రత్యేక పరిస్థితుల్లో తెలుగుదేశం పార్టీలో తిరుగుబాటు జరిగింది. చంద్రబాబు చేతిలోకి తెలుగుదేశం పార్టీ వచ్చింది. అయితే ఎన్టీఆర్ మరణానంతరం నందమూరి హరికృష్ణ టిడిపి నుంచి సస్పెండ్ అయ్యారు. ఏకంగా హరికృష్ణ చంద్రబాబు నాయకత్వాన్ని సవాల్ చేశారు. దీంతో ఆయనపై బహిష్కరణ వేటు పడింది. అటు తరువాత అన్న తెలుగుదేశం పార్టీని స్థాపించారు హరికృష్ణ. కానీ అనుకున్నంతగా సక్సెస్ కాలేకపోయారు. దీంతో తన పార్టీని తెలుగుదేశం పార్టీలో విలీనం చేయవలసి వచ్చింది.కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు రాగలిగారు వైయస్ రాజశేఖర్ రెడ్డి. ఏపీలో అధికారంలోకి రావడంతో పాటు కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు దోహదపడ్డారు. కానీ వైయస్ రాజశేఖర్ రెడ్డి మరణానంతరం ఆయన కుమారుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేశారు. అయితే ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆ పార్టీకి అండదండగా నిలిచారు రాజశేఖర్ రెడ్డి కుమార్తె షర్మిల. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత షర్మిలకు తగినంత ప్రాధాన్యం దక్కలేదు. దీంతో ఆమె పార్టీ నుంచి బయటకు వెళ్ళిపోయారు. కాంగ్రెస్ పార్టీలో చేరి ఏపీ అధ్యక్షురాలుగా మారారు. సోదరుడు జగన్మోహన్ రెడ్డి పైనే కాలు దువ్వుతున్నారు.తెలంగాణ తెచ్చిన నేతగా గుర్తింపు పొందారు కల్వకుంట్ల చంద్రశేఖర రావు. తెలంగాణకు తొలిసారిగా ముఖ్యమంత్రి అయ్యారు. రెండోసారి అధికారంలోకి వచ్చారు. కానీ 2023 ఎన్నికల్లో దారుణంగా ఓడిపోయారు. అప్పటినుంచి ఆ పార్టీ సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటుంది. ఇప్పుడు పార్టీ లైన్ దాటిన ఆయన కుమార్తె కవిత సస్పెన్షన్కు గురయ్యారు. కెసిఆర్ కుమార్తెగా, ఉద్యమ నాయకురాలిగా పార్టీలోకి వచ్చారు. గత కొన్ని రోజులుగా సొంత పార్టీపై, పార్టీ నేతలపై చేస్తున్న కామెంట్లు తీవ్ర వివాదాస్పదంగా మారుతున్నాయి. తాజాగా హరీష్ రావు, సంతోష్ రావులపై కవిత చేసిన కామెంట్స్ దుమారానికి కారణం అయ్యాయి. దీంతో కెసిఆర్ ఆదేశాల మేరకు ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. అయితే గత నాలుగు దశాబ్దాలుగా తెలుగు రాజకీయాలను ప్రభావితం చేసిన నేతల కుటుంబాల్లో.. రాజకీయ చీలికలు సర్వసాధారణంగా మారాయి.తద్వారా కుటుంబ రాజకీయాల మూలంగానే రెండు రాష్ట్రాల్లో రెండు పార్టీలు నష్టపోయాయి అన్న విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. కుటుంబ రాజకీయాలు మూలంగానే ప్రత్యర్థులకు అవి వరంగా మారాయి అని టాక్ వినిపిస్తోంది.

### ఉపాధ్యాయవృత్తికే వన్నె తెచ్చిన

# మహా మనిషి సర్వేపల్లి రాధాకృష్ణన్

## - నేడు ఆయన జయంతి, జాతీయ ఉపాధ్యయ దినోత్సవం

వృత్తి రీత్యా, వ్యక్తిత్వ రీత్యా, సంస్కార రీత్యా సర్వేపల్లి మహోన్నతుడు. పువ్వ పుట్టగానే పరిమళిస్తుందన్నట్టు చిన్నతనం నుంచి అసాధారణ ప్రజ్ఞా పాటవాలను ప్రదర్శించిన డాక్టర్ సర్వేపల్లి.. స్వశక్తితో ఉన్నత శిఖరాలకు ఎదిగి పలువురికి మార్గదర్శకంగా, తన వృత్తి ధర్మానికి మకుటంగా వెలిగారు. గురువులకే గురువుగా ఉపాధ్యాయవృత్తికే ఆదర్శంగా నిలిచారు ఆయన..సర్వేపల్లి రాధాకృష్ణన్ సెప్టెంబర్ 5, 1888 జన్మించి? ఏప్రిల్ 17, 1975 మరణించారు. భారతదేశపు మొట్టమొదటి ఉపరాష్ట్రపతి మరియు రెండవ రాష్ట్రపతి కూడా. అంతేకాదు భారతీయ తాత్వికచింతనలో పాశ్చాత్య తత్వాన్ని ప్రవేశ పెట్టినాడని ప్రతీతి. రెండు పర్యాయాలు ఉపరాష్ట్రపతి పదవి చేపట్టి, తరువాత రాష్ట్రపతిగా ఒక పర్యాయం పదవిని చేపట్టి, భారతదేశపు అత్యంత క్లిష్టకాలంలో(చైనా, పాకిస్తానులతో యుద్ధ సమయం) ప్రధానులకు మార్గనిర్దేశం చేశారు.సర్వేపల్లి రాధాకృష్ణన్ 5-9-1888న మద్రాసుకు ఈశాన్యంగా 64 కి.మీల దూరమున ఉన్న తిరుత్తణిలో సర్వేపల్లి వీరస్వామి, సీతమ్మ దంపతులకు జన్మించాడు. వారి మాతృభాష తెలుగు. సర్వేపల్లి బాల్యము, విద్యా భ్యాసము ఎక్కువగా తిరుత్తణి తిరుపతిలోనే గడిచిపోయాయి. ప్రాథమిక విద్య తిరుత్తణిలో సాగింది. తిరుపతి, నెల్లూరు, మద్రాసు క్రిస్టియన్ కాలేజీ మున్నగుచోట్ల చదివి ఎం.ఏ పట్టా పొందాడు. బాల్యం నుండి అసాధారణమైన తెలివితేటలు కలవాడా యాన. 1906లో 18 సంవత్సరాల చిరుప్రాయంలో శివకామమ్మతో వివాహము జరిగింది. వీరికి ఐదుగురు కూతుళ్ళు, ఒక కుమారుడు కలిగారు.వీళ్లది చాలాపేద కుటుంబం. ఉన్నత విద్య చదివించే స్తోమత లేదని తండ్రి వీరాస్వామి కొడుకును



పూజారిగా చేయమ న్నారు. కానీ రాధాకృష్ణన్కు చదువంటే ప్రాణం. అందుకే ఉన్నత పాఠశాల చదువు కోసం తిరుపతిలోని మిషనరీ పాఠశాలలో చేరారు. ఇక అప్పటినుంచీ ఈయన చదువంతా ఉపకారవేతనాలతోనే సాగి పోయింది. భోజనం చేసేందుకు అరిటాకు కూడా కొనలేని పరిస్థితుల్లో ఆయన నేలను శుభ్రపరచుకొని భోజనం చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో తత్వశాస్త్రంలో ఎమ్మే పూర్తిచేసిన రాధాకృష్ణన్ ఇరవై ఏళ్ల వయసులోనే మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో బోధకుడిగా చేరారు. ఆయన పాఠం చెప్పే తీరు విద్యార్థుల్లో ఎంతో ఆసక్తి కలిగించేది. ఆయన రోజులో 12 గంటలపాటు పుస్తకాలు చదువుతూనే ఉండేవారు. ఎన్నో విలువైన వ్యాసాలు, పరిశోధన పత్రాలను రాసేవారు. రాధాకృష్ణన్ మైసూర్ విశ్వవిద్యాలయం, కోల్కతా విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్ పదవులు చేపట్టడమే కాదు, ఆంధ్రా యూనివర్సిటీ, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయాల్లో ఉపకులపతి (వైస్ఛాన్స్‌లర్) గా పనిచేశారు. రష్యాలో భారత రాయబారిగా కూడా పనిచేశారు.ఆయన రాసిన 'ఇండియన్ ఫిలాసఫీ' పుస్తకం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ప్రత్యేక ఆహ్వానంపై ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ప్రసంగించారు. 'యూనివర్సిటీ ఎడ్యుకేషన్ కమిషన్'లో సభ్యుడిగా ఉండి మన విద్యా వ్యవస్థ అభివృద్ధికి ఎన్నో విలువైన సలహాలు, సూచనలు ఇచ్చారు రాధాకృష్ణన్. 1952లో మన మొదటి ఉపరాష్ట్రపతిగా, 1962లో భారత రెండో రాష్ట్రపతిగా అత్యున్నత పదవులు చేపట్టారు. 1954లో భారతరత్న పురస్కారం దక్కింది. అయినా ఏనాడూ ఆడంబ రాలకు పోలేదు .

రాష్ట్రపతిగా ఉన్నప్పుడు వచ్చే వేత నంలో కేవలం 25 శాతం తీసుకుని మిగతాది ప్రధాన మంత్రి సహాయ నిధికి తిరిగిచ్చేవారు. రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నప్పుడు విద్యార్థులకు శ్రద్ధగా బోధించడమే కాదు, వారిపై ప్రేమాభిమానాలు చూపేవారు. ఆయన మైసూరు నుంచి కలకత్తాకు ప్రొఫెసర్ గా వెళ్లేప్పుడు గుర్రపు బండిని పూలతో అలంకరించి తమ గురువును కూర్చో బెట్టి రైల్వేస్టేషన్ వరకు విద్యార్థులే లాక్కుంటూ వెళ్లారట.రాధాకృష్ణన్ రాష్ట్రపతి గా ఉన్నప్పుడు ఆయన శిష్యులు, అభిమానులు పుట్టినరోజును ఘనంగా చేస్తామని కోరగా, దానికి బదులు ఆ రోజును ఉపా ధ్యాయ దినోత్సవంగా చేయాలని ఆయన కోరారట. ఆరోజు నుంచే ఆయన పుట్టిన రోజును ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా మారింది

# ఎన్నికలకు రెడీ అవుతున్న ఏపీ ప్రభుత్వం

**విజయవాడ - సూర్య వాస్తవం**

ఏపీలో మరో ఎన్నికలకు రంగం సిద్ధం అవుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు ఎలక్షన్ కమిషన్ కసరత్తు ప్రారంభించింది. ప్రస్తుత పాలకవర్గాల పదవీకాలం ముగియడానికి ముందే ఎన్నికలు నిర్వహించాలని ఆలోచన చేస్తోంది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నీ పంచాయితీ రాజ్, పురపాలక శాఖల కమిషనర్లకు లేఖలు రాశారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు ప్రారంభించాలని ఆ లేఖలో కోరారు. ప్రస్తుత సర్పంచుల పదవీకాలం వచ్చే ఏడాది ఏప్రిల్ తో ముగియనుంది. మార్చిలో మున్సిపాలిటీలకు సంబంధించి పాలకవర్గాల పదవి కాలం ముగియనుంది.

అయితే ఐదేళ్ల పదవీకాలం ముగియడానికి మూడు నెలల ముందు ఎన్నికలు నిర్వహించే అవకాశం మున్సిపల్ కార్పొరేషన్ చట్టం 1955 లో ఉంది. అందుకే జనవరిలో ఎన్నికలు నిర్వహించాలని స్టేట్ ఎలక్షన్ కమిషన్ భావిస్తోంది. తక్షణం ఎన్నికల ఏర్పాట్లు ప్రారంభిస్తే.. జనవరి నాటికి నిర్వహణ సాధ్యమవుతుందని ఎన్నికల కమిషన్భా విస్తోంది. అక్టోబర్ 15 లోగా రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది. వార్డుల ఎగా ప్రచురించాలి. నవంబర్ 1 నుంచి 15లోగా ఎన్నికల అధికారుల నియామకాన్ని చేపట్టాలి. నవంబర్ 16 నుంచి 30లోగా పోలింగ్ కేంద్రాలను ఖరారు చేయాలి. డిసెంబర్ 15 లోపు రిజర్వేషన్లు ఖరారు చేయాలి. డిసెంబర్ చివరి వారంలో అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి.. 2026 జనవరిలో ఎన్నికల నోటిఫికేషన్, అదే నెలలో ఫలితాలు ప్రకటించేలా చేయాలన్నది ఎన్నికల కమిషన్



ప్రణాళిక.మరోవైపు జూలైలో ఎంపీటీసీ/ జడ్పిటిసి ఎన్ని కలు నిర్వహించాలని ఎన్ని కల కమిషన్ సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ప్రతినిధులు ఉన్నారు. అయితే అభివృద్ధి పరంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అందుకే మూడు నెలల ముందే ఎన్నికలు నిర్వహించి పాలక వర్గాలను తేవాలని ప్రభుత్వం భావిస్తోంది. కేంద్ర ప్రభుత్వ నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక నిధుల విషయంలో పంచాయతీల్లో ఇబ్బందులు ఉన్నాయి. కొన్ని పంచాయతీల్లో పనులకు అవరోధాలు ఏర్పడుతున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన స్థానిక సంస్థల ప్రతినిధులు కావడంతో అడ్డుపడుతు న్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వీలైనంత త్వరగా కొత్త పాలకవర్గాలను తెచ్చి.. అభివృద్ధి పనులను పరుగులెత్తించాలని ప్రభుత్వం భావిస్తోంది.

# 22 నుంచి అమల్లోకి కొత్త జీఎస్టీ

**ముంబై- సూర్య వాస్తవం**

ఊహించినట్టుగానే గేమ్‌ఛేంజర్ లాంటి నిర్ణయాలను ప్రకటించింది జీఎస్టీ కౌన్సిల్. రైతులు, సామాన్య-మధ్యతరగతి ప్రజలకు ఊరట కలిగేలా పెను మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇప్పటివరకున్న జీఎస్టీ స్లాబ్స్‌ను ఎత్తేసి.. రెండే రెంటిండిని తెరపైకి తీసు కొచ్చింది. కొత్త జీఎస్టీ స్లాబ్ రేట్లను సెప్టెంబర్ 22నుంచి అమల్లోకి తీసుకురాబోతోంది కేంద్ర ప్రభుత్వం.దేశ ప్రజలకు సూపర్ గుడ్‌న్యూస్ చెప్పింది కేంద్రం. జీఎస్టీ సంస్కరణలకు శ్రీకారం చుట్టిన నరేంద్ర మోదీ ప్రభుత్వం.. నిత్యవసర వస్తువులపై కలలో కూడా ఊహించనివిధంగా పన్నులను తగ్గించింది. కొన్నింటిపై అయితే మొత్తం జీఎస్టీనే ఎత్తేసింది. కేవలం రెండే రెండు స్లాబులను ప్రకటించింది. ఒకటి ఐదు శాతం, రెండోది 18శాతం.. అయితే, లగ్జరీ ఐటెమ్స్‌పై 40 పర్సెంటేజ్ విధించింది.33 ప్రాణాధార ఔషధాలు, లైఫ్-హెల్త్-టర్మ్ బీమా పాలసీలు, పర్సనల్-లైఫ్ ఇన్సూరెన్స్‌లపై పూర్తిగా ఊని ఎత్తేసింది కేంద్రం. అలాగే, స్టూడెంట్స్‌కి అవసరమైన మ్యాప్స్, చార్ట్స్, గ్లోబ్స్, పెన్సిల్స్, షార్ప్‌నర్స్, ఎరైజర్స్,




నోట్‌బుక్స్‌పై ఊని పూర్తిగా తొలగించింది. గతంలో వీటన్నింటిపై 5నుంచి 12శాతం ఊ ఉండేది.నిత్యవసరాలు, వ్యవసాయ ఉత్పత్తులు, ప్యాకేజ్డ్ ఫుడ్, పాల ఉత్పత్తులు, బేబీ కేర్, ఫర్టిలైజర్స్.. ఇలా అనేక వస్తువులపై ఇప్పటివరకు 12 నుంచి 18శాతమున్న ఊని 5శాతానికి తగ్గించింది. ఇందులో హెయిర్ ఆయిల్, టూత్‌పేస్ట్, సబ్బులు, టూత్‌బ్రెష్‌లు, షేవింగ్ క్రీమ్.. బటర్, నెయ్యి, చీజ్, డెయిరీ ప్రొడక్ట్స్, ప్రీప్యాక్డ్ నమ్‌కీన్స్, కాఫీ-టీ ఉత్పత్తులు.. ప్యాకేజ్డ్ చపాతీ, రోటి, పరోటా.. డ్రై ఫ్రూట్స్ అండ్ నట్స్.. సీ-ఫుడ్.. ఐస్‌క్రీమ్స్, ఫ్రొజెన్ ఫుడ్స్.. ఫ్రూట్ డ్రింక్స్, బేవరేజెస్.. బేకరీ ఉత్పత్తులు, చాక్లెట్స్, పన్నీర్-చెనా, సాస్ అండ్ సలాడ్స్, జామ్ అండ్ జెల్లీస్, ప్లాంట్ బేస్డ్ మిల్క్.. చిన్నపిల్లలకు వాడే నాప్కిన్లు, డైపర్లు, ఫీడింగ్ బాటిల్స్.. డయాగ్నోసిస్ పరికాలు, మెడిసిన్స్, పరికరాలు, కళ్లద్దాలు.. ట్రాక్టర్ విడిభాగాలు.. సైకిల్స్.. బయో పెస్టిసైడ్స్, బిందుసేద్యం పరికరాలు ఉన్నాయి.ఆ తర్వాత 18శాతం స్లాబ్.. ఇందులో సిమెంట్, టూవీలర్స్ అండ్ త్రీవీలర్స్, చిన్న కార్లు, 350 సీసీ కంటే తక్కువ వాహనాలు, ఏసీలు, టీవీలు, క్లీనింగ్ ఉత్పత్తులు, మానిటర్స్ అండ్ ప్రొజెక్టర్స్ ఇందులో ఉన్నాయి. గతంలో వీటన్నింటిపై 28శాతం ఊ ఉండగా.. దాన్నిప్పుడు 18శాతానికి తగ్గించారు. ఇక ఫైనల్‌గా 40 పర్సంటేజ్ స్లాబ్.. ఇందులో దాదాపు విలాసవంతమైన వస్తువులను చేర్చింది. 1200 సీసీ దాటిన పెట్రోల్ కార్లు, 1500 సీసీ దాటిన డీజిల్ కార్లు.. పాన్ మసాలా, సిగరెట్, గుట్కా లాంటి పొగాకు ఉత్పత్తులు.. కార్బొనేటెడ్ కూల్‌డ్రింక్స్‌పై అత్యధికంగా 40శాతం పన్ను విధించింది.రైతులు, సామాన్యులను దృష్టిలో పెట్టుకుని నెక్స్ట్ జనరేషన్ సంస్కరణలకు శ్రీకా రం చుట్టామని భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ఈ జీఎస్టీ సంస్కరణలు.. పౌరుల జీవితాలను మెరుగుపరుస్తుందన్నారు. పేద- మధ్య తరగతితో పాటు వ్యవసాయ-వైద్యరంగాల్లో కొత్త జీఎస్టీ స్లాబ్స్.. గేమ్ ఛేంజర్‌గా మారతాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు.

# నేత్రదానంపై అపోహలు వద్దు: జిల్లా కలెక్టర్

**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 4:** సమాజంలోని ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహన కలిగి ఉండాలని నేత్రదానంపై ఎలాంటి అపోహాలు పెంచుకోవద్దని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, వి. ఐఏఎస్ తెలిపారు.గురువారం నాడు ఉదయం అనంతపురం లోని ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ నేత్రదాన పక్షోత్సవాల కార్యక్రమాల నిర్వహణలో భాగంగా జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ పాల్గొని అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విస్తృతస్థాయిలో నేత్రదానం పై అవగాహన కార్యక్రమం చేపట్టడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. నేత్రదానం పై ప్రతి ఒక్కరిలోనూ అవగాహన అవసరమని తెలిపారు. నేత్రదానం చేసి ఇతరులకు సహాయం చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు.ముఖ్యంగా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా కంటి పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. అలాగే ఒక వ్యక్తి తన కళ్ళను దానం చేయడం ద్వారా చూడలేని మరొకరికి చూపుని కల్పించినట్లు అవుతుందని తమ కళ్ళను మరొకరికి అమరిన కారణంగా వారి చూపుల్లో మృతులు సజీవంగా ఉండిపోతారని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. దానాలలో ముఖ్యంగా నేత్రదానం కూడా ఎంతో ప్రధానమైనదని కలెక్టర్ తెలిపారు.

నేత్రదానం చేస్తామని ప్రతి ఒక్కరు ప్రతిజ్ఞ చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.తాను ఒక దివంగత మహానటుడి(రాజ్ కుమార్ సినీ నటుడు) జన్మదిన సందర్భముగా అలాగే అతని తనయుడు పునీత్ రాజ్ కుమార్ సేవా కార్యక్రమాలకు తాను ఆకర్షితుడై నేత్రదానంపై స్ఫూర్తి చెంది ఇటీవల కాలంలో విజయవాడలో తన సతీమణితో కలిసి నేత్రదాన ప్రతిజ్ఞ చేశామని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ స్పందిస్తూ కలెక్టర్ కు కరతాల ధ్వనులతో హర్షాన్ని వ్యక్తం చేశారు.అనంతరం రెడ్ క్రాస్ సేవల గురించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ సేవ కార్యక్రమాలు చాలా బావున్నాయని రెడ్ క్రాస్ కార్నియా సేకరణ కేంద్రమును త్వరలోనే పూర్తిస్థాయి "ఐ" బ్యాంక్ గా తీర్చిదిద్దంగా చర్యలు తీసుకోవడం జరుగుతున్నట్లు పేర్కొన్నారు.తద్వారా రాయలసీమ జిల్లాలలో మొదటి "ఐ" బ్యాంక్‌ను స్థాపించి




స్థానికులకు ఈసేవలు ఉపయోగపడే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం రెడ్ క్రాస్ వైస్ ఛైర్మన్ డా .లక్ష్మణ్ ప్రసాద్ గారు విద్యార్థులతో నేత్రదాన ప్రతిజ్ఞ చేయించి కార్యక్రమానికి విచ్చేసిన గవర్నమెంట్ కాలేజీ, ఎస్ ఎస్ బి ఎన్ డిగ్రీ కాలేజ్, ఏ కె ఎస్ ఎన్ మహిళా డిగ్రీ కాలేజీ, కె ఎస్ ఆర్ జూనియర్ కాలేజీ ల నుంచి 500 పైగా విద్యార్థులు వారి ప్రోగ్రామ్ ఆఫీసర్లు రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు, రెడ్ క్రాస్ నేత్ర కేంద్రము కమిటీ సభ్యులు, జిల్లా అందత్వ నివారణ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ డా. సైదన్న శాస్త్రి, ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా.పద్మజ ఇతర సామాజిక సేవా కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ ర్యాలీ ఆర్ట్స్ కళాశాల నుంచి ప్రారంభమై, టవర్ క్లాక్ సెంటర్, సప్తగిరి సర్కిల్ జిల్లాపరిషత్ మీదుగా తిరిగి ఆర్ట్స్ కళాశాల వద్ద ముగిసినది. ర్యాలీ ఆద్యంతం నేత్రదాన నినాదాలతో అవగాహతో ముందుకు సాగింది.

## ప్రభుత్వ కాలేజీల్లో అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయాలి

### - నారా లోకేష్‌కు వినతిపత్రం సమర్పించిన పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న




**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం ,సెప్టెంబర్ 4:** రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ కళాశాలలోని అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి వినతి పత్రం సమర్పి ంచినట్లు పిడిఎస్యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న తెలిపారు.కడప జిల్లా పర్యటనలో భాగంగా మంత్రిని కలిసి వినతి పత్రము సమరపిచ్చామన్నారు. ప్రభుత్వ విద్యారంగం బాగుపడాలంటే ముందుగా ఆయా విద్యాలయాల్లో ఉన్న అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని ఆయన మంత్రిని కోరినట్లు తెలిపారు. పది సంవత్స రాలుగా ఒక్క కళాశాల కూడా అధ్యాపకులు పోస్టుల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్ గత ప్రభుత్వాలు విడుదల చేయలేదని కంటితడుపు చర్యగా అప్పుడప్పుడు అతి తక్కువ సంఖ్యలో నోటిఫికేషన్ విడుదల చేసి నిరుద్యోగుల కడుపుకొట్టారన్నారు. 50% కళాశాలలో కాంట్రాక్టు పద్ధతులు అర్హతలు లేని వారితో విద్యాబోధనలు జరిపిస్తున్నారని తక్షణమే మంత్రి చర్యలు తీసుకొని అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయాలన్నారు ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకులు లేక విద్య దిగిజారి పోతుందని వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా డీఎస్సీ నోటిఫికేషన్ లో పాఠశాలలో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ టీచర్ల పోస్టు లేవన్నారు వాటిని కూడా తక్షణమే భర్తీ చేయడానికి కోరారు.

## ప్లాస్టిక్ రహిత పుట్టపర్తిగా మారుద్దాం

### - ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

**పుట్టపర్తి - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 4:** పుట్టపర్తి మున్సిపాలిటీని ప్లాస్టిక్ రహిత పట్టణంగా మారుద్దామని నియోజవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పట్టణ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిర్మూలించి ప్లాస్టిక్ రహిత పుట్టపర్తి మున్సిపాలిటీగా మారుద్దామని పుట్టపర్తి పట్టణ మున్సిపల్ కమిషనర్ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పోస్టర్ ను ఎమ్మెల్యేగా ఆవిష్కరించారు. పుట్టపర్తి పట్టణంలో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిర్మూలించి ప్లాస్టిక్ రహిత పుట్టపర్తి మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే పల్లె సిందూర పేర్కొన్నారు.పట్టణంలో ఫ్లెక్సీలు కూడా నిషేధించాలని మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే పల్లె సింధూర ఆదేశించారు. ప్లాస్టిక్ కవర్లు , ప్లాస్టిక్ బాటిల్లు విక్రయాలు పూర్తిగా నిషేధించేలా ప్రజల్లో మున్సిపల్ అధికారులు చైతన్యం తీసుకురావాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకాన్ని బాగా తగ్గిస్తూ వాటిని పూర్తిగా నిషేధించేలా మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలు ప్లాస్టిక్ వాడకం ఎంతో ప్రమాదకరమని దీనివల్ల క్యాన్సర్ వంటి జబ్బులు ఇతర వ్యాధులు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందని సూచించారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి జనపనార సంచులు , బట్ట బ్యాగులు ప్రత్యేకంగా వాడితే ఎంతో ప్రయోజనం ఉంటుందని తెలిపారు. ఇకపై పుట్టపర్తి మున్సిపాలిటీలో ప్లాస్టిక్ , ఫ్లెక్సీలు వాడకం పూర్తిగా నిషేధించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సూచించారు.




### శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో

## డ్రైవింగ్ లైసెన్స్ అండ్ సైబర్ క్రైమ్స్ పై అవగాహన

**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం, సెప్టెంబర్ 04:** అన్నమయ్య జిల్లా రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థినీ-విద్యార్థుల కోసం డ్రైవింగ్ లైసెన్స్ ప్రాముఖ్యత మరియు సైబర్ క్రైమ్స్ నివారణ అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాయచోటి పట్టణ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఎస్. కుల్లాయప్ప హాజరై విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..."ప్రతి వాహనదారుడికి చట్టబద్ధమైన డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి. లైసెన్స్ లేకుండా వాహనం నడపడం చట్టవిరుద్ధం మాత్రమే కాకుండా ప్రమాదకరం కూడా. యువత తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలను పాటించాలి. వాహనం నడిపేటప్పుడు హెల్మెట్, సీట్ బెల్ట్ వాడకం అలవాటు చేసుకోవాలి. డ్రంక్ అండ్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్ ప్రాణాలతో పాటు భవిష్యత్తును కూడా ప్రమాదంలో పడేస్తాయి" అని ఆయన హెచ్చ రించారు. అలాగే, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను తప్పనిసరిగా పాటించాలని, డ్రైవింగ్ సమయంలో మొబైల్ వినియోగం చేయరాదని సూచించారు. ట్రాఫిక్ నియమాలు




ఉల్లంఘించిన వారిపై తీసుకునే చట్టపరమైన చర్యలను దృశ్యరూపంలో విద్యార్థులకు వివరించారు.సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ ఆయన తెలిపారు ."ప్రస్తుత డిజిటల్ యుగంలో ఫేక్ కాల్స్, ఫిషింగ్ మెసేజ్‌లు, సోషల్ మీడియా మోసాలు, బ్యాంకింగ్ మోసాలు రోజురోజుకి పెరుగు తున్నాయి. వ్యక్తిగత సమాచారం, ఓటీపీ, పాస్‌వర్డ్, ఆధార్, బ్యాంక్ వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దు. అనుమానాస్పద లింకులు, అపరిచితుల ఫ్రెండ్ రిక్వెస్టులను వెంటనే నివారించాలి. ఏదైనా సైబర్ మోసం జరిగిన వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్ లేదా www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలి" అని ఆయన విద్యార్థులను జాగ్రత్త చేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ..."ఈ తరహా అవగాహన కార్యక్రమాలు విద్యార్థులలో చట్టపరమైన అవగాహన పెంచి, బాధ్యతా యుత పౌరులుగా సమాజంలో అడుగుపెట్టేలా చేస్తాయి. సాంకేతికతను సద్వినియోగం చేసుకోవడం, రోడ్డు భద్రతను కాపాడుకోవడం ప్రతి విద్యార్థి కర్తవ్యం" అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల యజమాన్యం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఎస్. కుల్లాయప్పని సన్మానించింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. బాలాజీ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి. వెంకటరమణ, ఎన్ఎస్ఎస్ అధికారి రెడ్డయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## సూపర్ సిక్స్- సూపర్ హిట్ సభకు భారీగా ఏర్పాట్లు

- వైసీపీ దుష్ప్రచారానికి సమాధానం అనంతపురం నుంచి ఇస్తాం
- ఎమ్మెల్యే దగ్గుపాటి, రాష్ట్ర, జిల్లా టీడీపీ నాయకుల వెల్లడి
- సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభా ఏర్పాట్లను పరిశీలించిన నేతలు

**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 4:** ఈనెల 10న అనంతపురం నగరంలో నిర్వహించబోతున్న సూపర్ సిక్స్- సూపర్ హిట్ విజయోత్సవ సభ టిడిపి పార్టీ నిర్వహించనుంది. ఈ సభకు సంబంధించిన ఏర్పాట్లు చురుగ్గా జరుగుతుండగా రాష్ట్ర, జిల్లా నాయకులు వీటిని పరిశీలించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ఆధ్వర్యంలో నాయ కులంతా ఈ సభాస్థలి ఏర్పాట్లను పరిశీలించి.. నిర్వా హకులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్సీ, ముఖ్యమంత్రి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర యాదవ్, ఎమ్మెల్యేలు దగ్గుపాటి, సురేంద్రబాబు, జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, గుంటూరు మేయర్, టిడిపి అబ్జర్వర్ కోవెలమూడి రవీంద్ర, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ బీవీ వెంకటరాముడు ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ లు మాట్లాడుతూ రెండేళ్లలో తొలిసారి రాష్ట్రస్థాయి కార్యక్రమం జిల్లా కేంద్రంలో జరుగుతోందన్నారు. 10వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహా ఎమ్మెల్యేలంతా వస్తారన్నారు. ఈ సభను పూర్తిస్థాయిలో విజయవంతం చేస్తామని దగ్గుపాటి ప్రసాద్



స్పష్టం చేశారు. నిన్నటి వరకు సూపర్ సిక్స్ పథకాలపై వైసీపీ దుష్ప్రచారం చేసిందని.. ఇప్పుడు హామీల అమలు తర్వాత కొత్త విష ప్రచారాలకు తెరలేపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో యూరియా కొరత అంటూ ప్రచారం మొదలు పెట్టారని.. ఎక్కడా యూరియా కొరత అనేది లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఏ విధంగా సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారో దేశమంతా చూస్తోందన్నారు. ఈ సభ ద్వారా తాము ఏం చేశామన్నది దేశం మొత్తం తెలిసేలా చెప్తామన్నారు. రాయలసీమ వాసుల కోరిక మేరకు అనంతపురం జిల్లాలో సభ నిర్వహిస్తున్నట్లు అబ్జర్వర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. ఇక్కడ 14 స్థానాలు టీడీపీ గెలిచిందని.. పార్టీ ఎప్పుడు ఏ కార్యక్రమం చేపట్టిన దిగ్విజయంగా పూర్తి చేస్తారన్నారు. అందుకే ఈ ప్రాంతంలో ద్వారానే సూపర్ సిక్స్ పథకాలు ఏ విధంగా సూపర్ హిట్ అయ్యాయన్నది వివరిస్తామన్నారు. మరోవైపు కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు మాట్లాడుతూ ఈ సభ విజయవంతం చేయడం మా బాధ్యత అని అన్నారు. అలాగే ప్రజలకు కూడా పెద్ద ఎత్తున తరలి రావడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు హంద్రీనీవా ప్రాజెక్టును పూర్తి చేసి అన్ని ప్రాంతాలకు నిరుస్తున్నారన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో త్వరలో రోడ్ల నిర్మాణానికి పంచాయతీరాజ్ తరఫున నిధులు పెద్ద ఎత్తున వస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ.. ప్రజలకు ఒక సందేశం ఇవ్వడానికి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు సురేంద్రబాబు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, రాష్ట్ర కార్యదర్శులు తలారి ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, రాయల్ మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, టిడిపి నాయకులు ఫిరోజ్ అహ్మద్, మోహన్ కుమార్, సంగా తేజస్విని, వడ్డే భవాని, నెట్టెం బాలకృష్ణ, డైరెక్టర్లు పి ఎల్ ఎన్ మూర్తి, పోతుల లక్ష్మీనరసింహులు, పరమేశ్వర్, కొండన్న టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధికి ఆమడ దూరంలో వీరబల్లి మండలం

- ఎక్కడ మురికి నీరు అక్కడే అంటున్న ప్రజలు
- చుట్టూ గ్రామాలకు అసౌకర్యంగా ఉన్న రోడ్లు ముఖ్యంగా వంగిమల్లకు కాజ్వే లేక తప్పని ఇక్కట్లు తప్పలేదంటున్న ప్రజలు రైతులు
- పట్టించుకోని పాలకులు అధికారులు
- చూసి చూడనట్లు పాలకులు



**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం, సెప్టెంబర్ 04:** అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గంలోని వీరబల్లి మండలం అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉందంటూ ఆ మండలంలోని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మండలం మరుముల ప్రాంతంలో ఉండడం వలన తమ మండలాన్ని పట్టించుకునే నాధుడు కరువయ్యారని పలువురు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా వీరబల్లి మండల ప్రజలు కేవలం ఎన్నికల వచ్చినప్పుడు మాత్రమే గుర్తు వస్తారని ఓట్ల కోసం వచ్చే నాయకులూ కూడా అది చేస్తాం ఇది చేస్తామంటూ మాటలు చెప్పి తీరా ఓట్లు వినియోగించుకున్న అనంతరం ఆ గ్రామాల వైపు కన్నెత్తి కూడా చూడరంటూ పలువురు ఆరో సిస్తున్నారు. ముఖ్యంగా మండల కేంద్రమైన వీరబల్లి లో నిన్న మురికి కాలువలు ఎక్కడికి వెళ్లాలంటూ వీరబల్లి గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు గతంలో వీరబల్లి నుంచి రాయచోటికి వెళ్లే ప్రధాన రహదారిలోని మురికి నీరు అంతా మల్లయ్య కుంటలోకి వెళ్లేదని ప్రస్తుతం ఆ మురికి నీరు గుంటలోకి వెళ్లకుండా దారులు మూసివేయడంతో మురికి నీరు ఎక్కడపడితే అక్కడ నిలిచిపోయి దోమల విహారం చేస్తూ ప్రజల ఆరోగ్యానికి ముప్పు తెచ్చే ప్రమాదాలు ఉన్నాయని పలువురు విమర్శిస్తున్నారు.

**విచ్చలవిడిగా మాండవే నదుల ఇసుక ఎత్త డంతో నెలకొన్న తాగునీటి సమస్య**

ఇకపోతే ప్రభుత్వం ఏర్పడ్డాక ఇసుకను ఉచితం చేయడంతో మాండవ్యా నధిలోని ఇసుకను విచ్చలవిడిగావీరబల్లికే కాకుండా రాయచోటి తదితర ప్రాంతాలకు తరలిస్తూ విక్రయించుకోవడం వలన వీరబల్లి గ్రామపంచాయతీ ప్రజలకు త్రాగునీరు లేక నానా అవస్థలు ఎదుర్కొంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

**రోడ్డు లేక వంగిమల గ్రామ ప్రజలకు తప్పని ఇక్కట్లు**

వీరబల్లి మండల కేంద్రానికి వంగిమల గ్రామం నుంచి వచ్చేందుకు దగ్గరగా ఉండేందుకుగాను గత కొన్నేళ్ల క్రితం ప్రభుత్వం నిధులు కేటాయిస్తూ పోలు చిన్నారెడ్డి గారి పల్లె సమీపానగల గంగనేరులో కాజ్వే ఏర్పాటు చేయడంతో గతంలో కురిసిన వర్షాలకు పూర్తిగా పాడైపోవడం వలన రోడ్డు కాజ్వే దెబ్బతినిపోయి ప్రస్తుతం తాము పొలాల నుండి



వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని దీంతో చాలా ఇబ్బందిగా ఉందని ఆ గ్రామ ప్రజలు వాపోతున్నారు. తమకు ఈ కాజ్వ్ శాశ్వతంగా నిర్మించినట్లయితే వీరబల్లికి కిలోమీటర్లోనే వెళ్ళిపోతామని ఆ ప్రాంతంలోనే రైతులు ప్రజలు చెబుతున్నారు.అదేవిధంగా కాజ్వే నిర్మించడం వలన దాదాపు 20 నుంచి 30 గ్రామాల ప్రజలకు సుదీర్ఘ ప్రయాణం కలదని వారు చెబుతున్నారు. ఇక శాశ్వతం కాకపోవడంతో నామమాత్రంగా నిర్మించడం వలన కేవలం బిల్లులకు మాత్రమే చేసుకునేందుకు పనికొస్తుంది తప్ప ప్రజలకు శాశ్వత కాజ్వే నిర్మించడం లేదన్న వాస్తవం సంబంధిత అధికారులు ఆ ప్రాంతానికి వచ్చి పరిశీలిస్తే తెలుస్తుందని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు పాలకులు చొరవ తీసుకొని గ్రామాల్లోని ప్రజలను పట్టించుకోని గ్రామ ప్రజలకు కావలసిన మౌలిక వసతులను కల్పించినట్లయితే ప్రజల గుండెల్లో పాలకులు అదేవిధంగా ప్రజలకు నమ్మకం కలిగించే అధికారులు కూడా ప్రజల దృష్టిలో ఉంటారని మండల ప్రజలు కోరుతున్నారు.



## కలెక్టర్ ఆర్డర్.. డోంట్ కేర్
# ప్రచారం.. తూతూ మంత్రం

- అనంతపురం సిటీ సరిహద్దు దాటని ప్రచారం
- జిల్లా కేంద్రానికే పరిమితమైన వైనం
- మారుమూల ప్రాంతాల వైపు కన్నెత్తి చూడని ఉద్యోగులు
- పది రోజుల స్పెషల్ డ్రైవ్ పేలవం
- తమకు సంబంధం లేనట్లు ఉంటున్న సీడీపీఓలు
- ఫోటోలకు పోటీ పడుతున్న తీరు

**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 4:**ఐసీడీఎస్ ఆధ్వర్యంలో లిసంకల్పం కింద చేపట్టిన పిల్లల పెంపకం, జ్ఞానం, నాయకత్వం, సానుకూల వైఖరి కోసం స్థిరమైన చర్య కోసం పది రోజుల పాటు చేపట్టిన ప్రచార కార్యక్రమం తూతూ మంత్రంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నెల 2 సెప్టెంబర్ నుంచి ప్రారంభమైన కార్యక్రమం ఈ నెల 12 వరకు కొనసాగనుంది. ఐసీడీఎస్ అనుబంధ విభాగాల సహకారంతో చేపట్టాల్సిన కార్యక్రమం జిల్లా కేంద్రం చుట్టూనే సాగుతోంది.

**ప్రధాన ఉద్దేశం ఏమంటే..**

జెండర్ సెన్సిటైజేషన్, లైంగిక, పునరుత్పత్తి, ఆరోగ్యం, పని ప్రదేశంలో మహిళల భద్రత, చట్టపరమైన అవగాహన, ఉన్నత విద్య, వృత్తి శిక్షణ, నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాల ద్వారా మహిళలను సాధికారపరచడం, మహిళలు, కౌమార బాలికల ఆరోగ్యం, పోషకాహారంపై సదస్సులు నిర్వహించి విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాల్సి ఉంది. ఇంకా పోక్సో చట్టంపై అవగాహన, సమ్మతి. అసంఘటిత రంగంలో రాణిస్తున్న బాలిక/మహిళలకు అవగాహన కోసం సదస్సులు, బాల సభలు, సామర్థ్యాన్ని పెంపొందించే సెషన్‌లు, వర్క్‌షాప్‌లు, సైన్స్ ఎగ్జిబిషన్/ ఎక్స్‌పోజర్ ద్వారా విస్తృత అవగాహన కల్పించాల్సి ఉంది.

**నెరవేరని లక్ష్యం..**

ఎంతో ప్రాధాన్యం కలిగిన ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని మారుమూల ప్రాంతాల్లో విస్తృతంగా నిర్వహించి ప్రచారం చేయాల్సిన అధికారులు జిల్లా కేంద్రం దాటితే ఒట్టు. అనంతపూర్ నగరంలోని పలు పాఠశాలలు, కాలేజీలకు వెళ్లడం హడావుడి చేసి, ఫొటోలు తీసుకోవడం మమ అనిపించి తిరుగు ప్రయాణం కావడం పొరబాటుగా మారిందనే విమర్శలు ఉన్నాయి.

**కనిపించని సీడీపీఓలు**

కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్, ఐసీడీఎస్ పీడీ మల్లెపోగు నాగమణి ఆదేశాలతో చేపట్టిన కార్యక్రమాన్ని కింది స్థాయి అధికారులు, సిబ్బంది మొక్కుబడిగా మార్చుడంపై కొందరు మండిపడుతున్నారు. తమకేం సంబంధం లేనట్లు కొందరు సీడీపీఓలు మొహం మీదే చెప్పేస్తున్నట్లు కింది స్థాయి సిబ్బంది ఆవేదన వ్యక్తం చేసారు. సూపర్ వైజర్లను పిలుచుకెళ్లండి అంటున్నారని వాపోయారు. ఐసీడీఎస్ అనుబంధ ఉద్యోగులు కొందరు గ్రామీణ ప్రాంతాలు తమకు సంబంధం లేదని, జిల్లా కేంద్రంలో మాత్రమే తాము కార్యక్రమాలు నిర్వహిస్తామని గిరిగీసి చెబుతున్నట్లు తెలుస్తోంది.

**కలెక్టర్ గారు ఓసారి చూడండి**

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ కింద చేపట్టిన పది రోజుల ప్రత్యేక కార్యక్రమం అమలు తీరుపై కలెక్టర్ వినోద్ కుమార్ -కన్నేసి ఉంచాలని శాఖ ఉద్యోగులే అంటున్నారంటే పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు.

# వృద్ధ దంపతులు అదృశ్యం... పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు

-గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు కుటుంబ సభ్యులు

**చెన్నూరు-సూర్య వాస్తవం, సెప్టెంబర్ 4:** మండల కేంద్రమైన చెన్నూరు పడమట వీధి చౌడేశ్వరి దేవాలయం దగ్గరలో నివాసముంటున్న ఆవుల వెంకటసుబ్బయ్య(84) ఆవుల నాంచారమ్మ(76) వృద్ధ దంపతులు బుధవారం ఉదయం 11 గంటలకు ఇంటి నుంచి కట్టు బట్టలతో వెళ్లిపోయారు. సాయంత్రం కుమారుడు ప్రసాద్ ఇంటికి రాగా తల్లిదండ్రులకు కనిపించకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కుటుంబ సభ్యులు కథనం ప్రకారంవివరాలు ఇలా ఉన్నాయి. వృద్ధ దంపతులు వెంకటసుబ్బయ్య నాంచారమ్మ ఇరువురు ఆరోగ్యం



సరిగా లేకపోవడంతో బాధపడుతూ పెద్ద కుమారుడు దగ్గరే ఉండేవారని తెలిపారు. కుమారుడు కోడలు పనుల కోసం వెళ్లడంతో ఇంట్లో ఎవరు లేని సమయం చూసి కట్టుబట్టలతో ఇంటి నుంచి వెళ్లిపోయారన్నారు. వృద్ధ మహిళ దగ్గర ఉన్న మెడలో ఉన్న తాళిబొట్టు బంగారం వారి దగ్గర ఉన్న డబ్బులు ఇంట్లోనే పెట్టి వెళ్లిపోవడం జరిగిందని తెలిపారు.చెన్నూరు పోలీసులు గాలింపు చర్యలో భాగంగా రామాలయం వీధిలోని సీసీ కెమెరాలు పరిశీలించగా వృద్ధులు ఆటోలో వెళుతున్నట్లు కనిపించిందని ఈ విషయంపై ఆటో డ్రైవర్ను విచారించగా చెన్నూరు కొత్త రోడ్డు వద్ద వారిద్దరూ ఆటో దిగారని పోలీసులకు వివరించారు. కొత్త రోడ్డుపై నుంచి మైదుకూరు వైపు బస్సు ఎక్కి వెళ్ళిపోయినట్టు తెలుస్తుందని వారి వద్ద ఆధార్ కార్డులు ఉన్నట్టు తెలుస్తుంది. చెన్నూరు సిఐ కృష్ణారెడ్డి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. వృద్ధ దంపతులకు ముగ్గురు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యులు బంధువులు వివిధ ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు.

## ప్రగతి మండల సమైక్య
# కార్యాలయంలో ఆర్.ఎం.పి ప్రోగ్రాం







**గాండ్లపెంట-సూర్య వాస్తవం, సెప్టెంబర్ 4:** మండలంలోని స్థానిక ప్రగతి మండల సమైక్య కార్యాలయంలో పరిశ్రమల శాఖ వారి ఆధ్వర్యంలో ర్యాంప్ ప్రోగ్రాంలో భాగంగా జాత్య సాహిక పారిశ్రామిక వేతలకు ఒక్కరోజు ఉద్యం వర్క్ షాప్, నూతన పరిశ్రమల స్థాపనపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా పారిశ్రామిక కేంద్రం విస్తరణ అధికారి సంజీవరాజు, ఆయన మాట్లాడుతూ పథకాలను, కేంద్ర ప్రభుత్వం పథకాలను వినియోగించుకొని పారిశ్రామిక వేతలుగా కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక కుటుంబం ఒక పారిశ్రామికవేత్త అని నినాదంతో జాత్య ఇక పారిశ్రామిక వేతలను వివిధపథకాల ద్వారా ప్రోత్సహిస్తుందని తెలియజేశారు. ఇందులో భాగంగా ప్రతి ఒక్క వ్యాపారవేత ఉద్యం రిజర్వేషన్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఏపీఎం సూర్యనారాయణ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పథకాలను అయినా పీఎం ఎఫ్ ఎం ఈ, పీఎం ఈఈపి, ఐడి పి 2024-29 మరియు ముద్ర పథకాలను వినియోగించుకొని అందరూ ఇష్టమైన ప్రాజెక్టు ద్వారా పారిశ్రామికవేతలుగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమానికి దాదాపు 120 మంది జాతీయహిక పారిశ్రామిక వేతలు పాల్గొన్నారు. వర్క్ షాప్ లో భాగంగా ఇక్కడే దాదాపు 50 మంది కి ఉద్యం రిజర్వేషన్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పరిశ్రమలవిస్తరణ అధికారిజెపి దుర్గేష్, పరిశ్రమల విస్తరణ అధికారి ఓబులేసు, ప్రగతి మండల సమైక్య అధ్యక్షురాలు మరియు మండల అభివృద్ధి కార్యాలయ డిజిటల్ అసిస్టెంట్ పాల్గొన్నారు.



## సియం గారూ! రాజంపేట సభలో మామిడి రైతులకు

# డబ్బులు వెలసినట్లు మీరు చెప్పింది నిజం కాదు

**- నేడు జరిగే కేబినెట్ సమావేశంలో సమీక్షించి నిజాలు తెలుసుకోండి**
**- మామిడి రైతుల వేడుకోలు**



**రాయచోటి -సూర్య వాస్తవం, సెప్టెంబర్ 04:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారూ! రాజంపేట సభలో తోతాపురి మామిడి రైతులకు డబ్బులు వెలసినట్లు మీరు చెప్పింది నిజం కాదని, పోరపాటున చెప్పారో లేక సమాచారం లోపం చెప్పారో తెలియదు గానీ, నేడు జరిగే కేబినెట్ సమావేశంలో సమీక్షించి నిజాలు తెలుసుకొని తోతాపురి మామిడి రైతులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కిమ్ (యంఐయస్) నిధులు మరింత జాప్యం జరగకుండా రైతుల ఖాతాల్లో వెంటనే జమ చేయాలని రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యులు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి ప్రభుత్వానికి గురువారం పత్రిక విలేఖరులతో మాట్లాడుతూ డిమాండ్ చేశారు. అలాగే చిత్తూరు ఉమ్మడి జిల్లా మరియు అన్నమయ్య జిల్లా మామిడి రైతులు చేస్తున్న విజ్ఞప్తి మేరకు ధరలు పతనం కావడంతో చెట్లపైనే మాగి రాలిపోయి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని, తోతాపురి మామిడి రైతులకు నష్ట నివారణ చర్యలు చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడుకి డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తోతాపురి మామిడి రైతులకు ఆదుకోవడం కొరకు రూ.4 లు ప్రభుత్వం చెల్లిస్తుందని, రూ.8 లు గుజ్జు పరిశ్రమలు చెల్లించాలని ఆదేశించారని ఆయన తెలిపారు.అలాగనే చిత్తూరు జిల్లా కలెక్టర్ ప్రొసీడింగ్స్ జారీ చేశారని,3-07-25 వ తేదీన మామిడి గుజ్జు పరిశ్రమల యజమానులతో ముఖాముఖి గా రూ.8 లు చెల్లించాలని కుప్పంలో ఆదేశించారని ఆయన తెలిపారు. ఆ సందర్భంగా పరిశ్రమల యజమానులు వ్యతిరేకించలేదని, అయితే ఇప్పుడు చెల్లింపుల సమయంలో ప్రభుత్వ ఆదేశాన్ని ధిక్కరించి ,కొందరు 4 రూపాయలు, మరి కొందరు 6 రూపాయలు మాత్రమే చెక్కులు రైతులకు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు.కేంద్ర ప్రభుత్వ సంస్థ చిత్తూరు మామిడి ఉత్పత్తి ఖర్చుగా రూ.14.90 లు గా నిర్ణయించి 25 శాతం చెల్లించిందని ఆయన తెలిపారు.అయితే గుజ్జు పరిశ్రమలు అధికం ఉన్న చిత్తూరు జిల్లాలో జిల్లా అధికారులు, రాష్ట్ర అధికారులు ఉత్పత్తి ఖర్చు రూ.12 లుగా నిర్ణయించారని, ఇప్పుడు రైతులకు కేవలం 8- 10 రూపాయలు మాత్రమే వస్తున్నదని, రైతులకు ప్రతి కేజీకి 4 రూపాయలు సరాసరి నష్టం వస్తుందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలను గుజ్జు పరిశ్రమలు ధిక్కరించడం వల్ల రైతులకు పెట్టుబడి కూడా తిరిగి రావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆదేశాలను గుజ్జు పరిశ్రమల యజమానులు, ర్యాంపుల నిర్వా హకులు యధాతథంగా అమలు చేసి రూ.8 లు చొప్పున ప్రతి రైతుకు చెల్లించుటట్లు తగు చర్యలు తీసికొని 60 వేల మంది రైతులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేసారు.అంతే కాకుండా మామిడి కాయల మండిల సిండికేట్ ద్వారా వ్యాపారులు, మామిడికాయ గుజ్జు పరిశ్రమలు చేసే మోసాలతో రైతులకు జరుగుతున్న నష్టాలు ప్రభుత్వం నిలురించలేక పోయిందని, ప్రభుత్వం ప్రకటించిన మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కిమ్ (యంఐయస్) నిధులు ఇప్పుటకీ రైతులకు అందజేయడంలో విఫలం చెందడంతో రైతులు సకాలంలో మామిడి తోటల్లో సేద్యం చేయలేకుండా వెనుకబడి పోయారని ఆయన విచారం వ్యక్తం చేశారు. రైతులు నిరుత్సాహంతో అచేతన స్థితిలోకి నెట్టబడి ఉన్న నేపథ్యంలో మామిడి తోటల సంరక్షణ చర్యలు తీసుకోలేక, పంట దిగుబడులు పతనమై ఆహార కొరత, ఆర్థిక మాధ్యమం ఏర్పడే ప్రమాదం ఉందని ఆయన తెలిపారు.ఇప్రభుత్వాలు భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించాల్సిన పరిస్థితులు ఏర్పడగలవని ఆయన హెచ్చరించారు.నేడు జరిగే రాష్ట్ర మంత్రి మండలి సమావేశంలో చర్చించి తోతాపురి మామిడి రైతులకు నష్ట నివారణ చర్యలు చేపట్టి రైతులకు ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## గణపతి మహోత్సవాలలో

# ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య





విజయవాడ×సూర్య వాస్తవం:సెప్టెంబర్ 4,నందిగామ పట్టణంలో వాసవి మార్కెట్ ఆధ్వర్యంలో జరుగుతున్న 43వ వార్షిక గణపతి మహోత్సవాలు ఘనంగా కొనసా గుతున్నాయి. ఈ మహోత్సవాల ప్రధాన ఆకర్షణగా గణనాథుడిని రూ. 3.10కోట్ల కరెన్సీనోట్లతో అలంకరించడం జరిగింది. ప్రత్యేక అలంకరణను చూసేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి గణనాథుని దర్శించుకున్నారు. గురువారంనాడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్థానిక నేతలతో కలిసి వాసవి మార్కెట్ గణనాథుని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గణ నాథుని ఆశీస్సులతో నందిగామ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోంది. ఇలాంటి మహెూత్సవాలు ప్రజల్లో ఐక్యత, భక్తి, సాంస్కృతిక విలువలను పెంపొందిస్తాయి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ ఏచూరి రాము, కమిటీ సభ్యులు, వివిధ హెూదాలో ఉన్న టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**భక్తుల రద్దీ – నిర్వాహకుల ఏర్పాట్లు:** మహోత్సవాల కారణంగా నందిగామ పట్టణం భక్తులతో కిక్కిరిసిపోయింది. భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు ప్రత్యేక క్యూలైన్‌లు, భద్రతా చర్యలు చేపట్టారు. అదనంగా అన్నదాన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకలను మరింత వైభవోపేతంగా కొనసాగిస్తున్నారు.

# మంత్రి ఫారుక్‌ను కలిసిన అజ్మీర్ పీఠాధిపతి



**విజయవాడ- సూర్య వాస్తవం,సెప్టెంబర్ 4 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి ఎండి ఫారుక్‌ను రాజస్థాన్ అజ్మీర్ దర్గా పీఠాధిపతులు సయ్యద్ సుల్తాన్ హసన్ చిస్టీ బాబా గురువారంనాడు ప్రత్యేకంగా కలిశారు. అనంతరం మంత్రి అజ్మీర్ గురువును ఘనంగా సత్కరించారు. అనంతరం యావత్ ముస్లిం సమాజానికి ఈద్ మిలాద్ నబీ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరూ ముఖ్యమంత్రి పాలనలో సంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని ప్రత్యేకంగా దూఆ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు ఫారుక్ షిబ్లి,సూఫీ మత గురువులు అల్తాఫ్ బాబా, టిడిపి ముస్లిం మైనార్టీ అప్సర్ జమా, ముస్లిం మత గురువులు పాల్గొన్నారు.


## ప్రజలు సంతృప్తి చెందేలా

# అధికారులు, సిబ్బంది సేవలందించాలి

**- జిల్లాలో చిన్న తరహా నీటిపారుదల ట్యాంకుల నిర్వహణలో పెండింగ్ పనులను పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి**



**అన్నమయ్య బ్యూరో- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 4:** ప్రజలు సంతృప్తి చెందేలా అధికారులు మరియు సిబ్బంది సేవలందించాలని, జిల్లాలో చిన్న తరహా నీటిపారుదల ట్యాంకులను నింపడంలో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం అమరావతిలోని సచివాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ప్రధానమంత్రి కుసుం, చిన్న తరహా నీటిపారుదల ట్యాంకుల నిర్వహణ, భూగర్భ జలాల పెంపుదల, ఐవిఆర్ఎస్ ద్వారా ప్రజల నుండి అభిప్రాయాల సేకరణ, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.రాయచోటి కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఓ మధుసూదన్ రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.... ప్రధానమంత్రి కుసుం కార్యక్రమంలో సోలార్ పవర్ యూనిట్లను ఏర్పాటు చేయబోయే కంపెనీలకు గుర్తించబడిన ప్రభుత్వ మరియు ప్రైవేటు భూములకు సంబంధించి పెండింగ్ పనులను పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలలో చిన్న తరహా నీటిపారుదల ట్యాంకుల నిర్వహణపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సేవలు మరియు ప్రభుత్వ పనులకు ఉపయోగకరంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కృత్రిమ మేధస్సు - జెన్ చాట్ బాట్ ప్రాజెక్టుకు సహకరించేలా చర్యలు చేపట్టాలని సిపిఓ ను ఆదేశించారు. ప్రజల నుండి ఆసుపత్రులలో అందిస్తున్న సేవలపై సేకరించే అభిప్రాయాలపై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కంప్రెస్డ్ బయోగ్యాస్ సమీక్షిస్తూ.. వీటిని ఏర్పాటు చేయబోయే కంపెనీలకు గుర్తించబడిన ప్రభుత్వ మరియు ప్రైవేటు భూములకు సంబంధించి పెండింగ్ పనులను పూర్తి చేయాలని సూచించారు.అనంతరం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇచ్చిన సూచనల మేరకు సంబంధిత శాఖల వారు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



# ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ తనిఖీలు

**- అమ్మకాలు తాత్కాలికంగా నిలిపివేత**



**గుత్తి -సూర్య వాస్తవం, సెప్టెంబర్ 04:** గుత్తి పట్టణం లోని ఎరువుల అం గళ్ళను అనంతపురం జిల్లాని ఘా,పరివేక్షణ బృందం గురువారం డి.ఎస్.పి ఎం.నాగ భూషణ, సీఐ కె.శ్రీనివాసులు,వాసుపకాష్ అగ్రికల్చర్ సిబ్బంది త నిఖీ నిర్వహించడం జరిగింది. ఇం దులో భాగంగా శ్రీ బాలాజీ ఫర్టిలై జర్,సింధు ఫర్టిలైజర్,సాయి కృష్ణ ఫర్టిలైజర్,ధనలక్ష్మి సీడ్స్ అండ్ పే షసైడ్ మొదలగు షాపులలోయూ రియా, ఇతర ఎరువులపై ఆరా తీశారు.రూ.433000 స్టాక్స్ నాకు బిల్లులు లేనం దున తాత్కాలి కంగా అమ్మకాల ను నిలిపివేశారు.యూరియా రూ. 266 కంటే అధికంగా అమ్మితే చట్టరీత్యా చర్యలు తీసు కుంటామనివారు తెలిపారు. యూరియా కొరత ఉన్నదని రైతులు భయభ్రాంతులకు గురి కాకూ డదని విజిలన్స్ అండ్ ఎన్ఫో ర్స్మెంట్ డి.ఎస్.పి ఎం.నాగభూష ణం తెలిపారు.ఈ కార్యక్ర మంలో గుత్తి ఏ డి ఏ వెంకట రాముడు, గుత్తి వ్యవసాయ అధికారి ముస్త క్ అహమద్ తదితరులు పాల్గొ న్నారు.

## గణనాథుని

# ఆశీస్సులు ప్రజలందరికీ కలగాలి

**- పాత రాయచోటిలో కొలువు తీరిన గణపతి మండపాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించిన వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి**



**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం, సెప్టెంబర్ 04:** గణనాథుని ఆశీస్సులు ప్రజలందరికీ కలగాలని వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి ఆకాంక్షించారు. రాయచోటి పట్టణం పాత రాయచోటి లో కొలువు తీరిన గణపతి మం డపాన్ని గురువారం శ్రీకాంత్ రెడ్డి సందర్శించారు. వినాయకుడి కి ప్రత్యేక పూజలు గావించారు. తీర్థ ప్రసాదాలు అందించి శ్రీకాంత్‌రెడ్డిని దుస్సాలువతో సత్కరించారు. గణనాథుని కృపతో ప్రజలందరూ సుభిక్షంగా, సంతోషంగా ఉండాలని శ్రీకాంత్ రెడ్డి ఆకాంక్షించారు. ఆయనచేతులమీదుగా అన్నదాన కార్యక్రమ ప్రారంభం. అన్నదానం మహాదానమని శ్రీకాంత్ రెడ్డి అన్నారు.వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా స్థానిక కౌన్సిలర్ గువ్వల లక్ష్మీదేవి, వాల్మీకి సంఘ జిల్లా అధ్యక్షుడు గువ్వల బుజ్జిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంను శ్రీకాంత్ రెడ్డి చేతులమీదుగా ప్రారంభింప చేశారు. వైఎస్ఆర్ సిపి కార్యకర్త గువ్వల జగదీశ్ నివాసంలో తేనీటి విందు వైఎస్ఆర్ సిపి కార్యకర్త గువ్వల జగదీశ్ నివాసంలో ఇచ్చినతేనీటి విందును శ్రీకాంత్ రెడ్డి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, వైఎస్ఆర్ సిపి మైనారిటీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ తబ్రేజ్, సీనియర్ నాయకులు అష్రఫ్ అలీఖాన్,అన్నా సలీం, బీసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి విజయ భాస్కర్, కొత్తిమీర ప్రసాద్, రాజా గోపాల్ రెడ్డి, ఉప సర్పంచ్ తిరుపాల్ నాయుడు, ట్రేడ్ యూనియన్ అశోక్ ,పట్టణ యూత్ అధ్యక్షుడు కొత్తపల్లె ఇంతియాజ్ ,జగన్,సాకేరెడ్డి ఆంజనేయులు, నాగసుబ్బయ్య, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహమ్మద్

# ప్రవక్త గంధం వేడుకలు

**- గౌస్ మొద్దీన్ ఆధ్వర్యంలో విందు ఏర్పాటు, హాజరైన ప్రముఖులు**

**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 4:** మహమ్మద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా మాజీ గ్రంథాల సంస్థ చైర్మన్ గౌస్ మొహిద్దిన్ ఆధ్వర్యంలో పామిడిలోని మసీదుకు గంధం సమర్పించారు. మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గంధం తీసుకెళ్లే కార్యక్రమంలో భాగంగా విందు ఏర్పాటు చేసారు. ఈ విందులో టిడిపి ప్రముఖులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర యాదవ్, మంతెన సత్యనారాయణ రాజు, ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, బండారు శ్రావణిశ్రీ, జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర, ధర్మవరం టిడిపి ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ పార్టీలకతీతంగా నాయకులు, మత పెద్దలు, నగరంలోని ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిరయతి గౌస్ మోద్దిన్ మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ప్రతి ఏటా మిలాద్-ఉన్-నబి మహమ్మద్ ప్రవక్త జన్మదినం ముందు రోజు తన ఇంటి నుండి పామిడి నందు గల మసీదుకు భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తూ గంధం తీసుకెళ్లే కార్యక్రమం నిర్వహి స్తున్నామన్నారు. మహమ్మద్ ప్రవక్త ఆశీస్సులు అందరిపై ఉండాలని గౌస్ మొద్దీన్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లా టిడిపి నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.



# పెళ్లకూరు మండల సమస్యలపై రెవెన్యూ మంత్రికి టీడీపీ నేతల ఫిర్యాదు

**- అమరావతిలో మంత్రిని కలిసిన మండల నాయకులు**



**పెళ్లకూరు- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 04:** పెళ్లకూరు మండలంలోని అభివృద్ధి, రెవెన్యూ అధికారుల పనితీరు పట్ల అసంతృప్తిని వ్యక్తం చేస్తూ టిడిపి నాయకులు మంగళవారం అమరావతిలో రాష్ట్ర రెవెన్యూ , తిరుపతి జిల్లా ఇన్‌చార్జి మంత్రివర్యులు అనగాని సత్య ప్రసాద్‌ను కలిసారు. మండల ప్రజా సమస్యలపై వ్రాతపూర్వకంగా ఫిర్యాదు సమర్పించారు.ఈ సందర్భంగా జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు మురళీకృష్ణ రెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు శివకుమార్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం కార్యదర్శి నాగేందర్ రెడ్డి, సీనియర్ నేత, స్వర్ణముఖి ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ పేరం రమేష్ నాయుడు, చైతన్య కృష్ణారెడ్డి, కాటూరు గోపాల్ రెడ్డి, నియోజకవర్గ వాణిజ్య విభాగం కార్యదర్శి కలవకోలు మునీష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు యూరియా కొరత తీర్చలేని కూటమి ప్రభుత్వం

**- మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య. వైసీపీ నేతలు**
**- ఆర్థిక ఇబ్బందుల్లో రైతులు**
**- ఈ నెల 9న సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం**
**- మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య**



**నాయుడుపేట- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 4:** యూరియా కొరత తీర్చలేని కూటమి ప్రభుత్వ అసమర్థ పాలనలో రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య విమర్శించారు. గురువారం నాయుడుపేట పట్టణంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రైతులకు అవసరమైన యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయం ఎదుటనిరసన కార్యక్రమం నిర్వహిం చనున్నట్లు తెలియజేశారు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, రైతులు నిరసన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, వైసీపీ జిల్లా కార్యదర్శి తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి,నాయుడుపేట మాజీ ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్ధన్ రెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయుడుపేట పట్టణ అధ్యక్షులు కలికి మాధవరెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయుడుపేట మండల అధ్యక్షులు ఒట్టూరు కిషోర్ యాదవ్, నాయుడుపేట ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి,మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక,ఓజిలి మండల పార్టీ అధ్యక్షులు పాదర్తి హరినాద్ రెడ్డి పలువురు నాయకులు పాల్గొన్నారు.

## దొరవారిసత్రం ఓవర్‌బ్రిడ్జి వద్ద బైక్ అదుపుతప్పి ప్రమాదం



**పెళ్లకూరు, సూర్యా వాస్తవం, సెప్టెంబర్ 04:** దొరవారిసత్రం సమీపంలోని జాతీయ రహదారి ఓవర్‌బ్రిడ్జి వద్ద గురువారం బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో కాళహస్తి ప్రాంతానికి చెందిన శంకర్ అనే యువకుడు తీవ్ర గాయాలు పొందాడు.వివరాల ప్రకారం, శంకర్ బుధవారం రాత్రి దొరవారిసత్రం మండలం టపాయిండ్లు గ్రామంలో జరిగిన పెళ్లికి హాజరయ్యాడు. గురువారం స్వగ్రామానికి తిరిగి వెళ్తున్న సమయంలో ప్రమాదం చోటు చేసుకుంది. బైక్ అదుపు తప్పడంతో శంకర్ రోడ్డు పై పడిపోయి తీవ్రంగా గాయపడినట్లు సమాచారం.అతన్ని వెంటనే దొరవారిసత్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నాయుడుపేటలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## జిల్లా ఎస్పీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన తలారి పెద్దయ్య



అనంతపురం క్రైం -సూర్య వాస్తవం, సెప్టెంబర్ 4: అనంతపురం జిల్లా ఎస్పీ పి జగదీష్ జన్మదినం సందర్భంగా గురువారం నాడు ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో అనంతపురం 14వ బెటాలియన్ ప్రెసిడెంట్ , ఏపీ రాష్ట్ర పోలీస్ ఆఫీసర్ సంఘం ఈ సిమెంబర్ తలారి పెద్దయ్య మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు . ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గణేష్ తదితరులు ఉన్నారు.

## నాయుడుపేట బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థుల ఆవేదన

**- వార్డెన్ తీరుపై తల్లిదండ్రుల ఆగ్రహం**
**- అధికారుల జోక్యం కోరుతూ నిరసన**




**నాయుడుపేట- సూర్యా వాస్తవం, సెప్టెంబర్ 04:** తిరుపతి జిల్లా నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని బీసీ బాలుర వసతి గృహం పరిస్థితులు అత్యంత దయనీయంగా ఉన్నాయని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వసతులు కూడా లేవని, విద్యార్థుల సమస్యల పట్ల వార్డెన్ పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నాడని వారు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు.విద్యార్థుల వాపోతూ చెబుతూ, భోజనం సరిగా ఉడకకుండా తినమని బలవంతం చేస్తున్నారని, రాత్రి వేళల్లో దోమలతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. బాత్రూములు కూడా సక్రమంగా లేవని, పరిశుభ్రత లోపిస్తోందని వారు వెల్లడించారు. అదేవిధంగా వార్డెన్ విద్యార్థులను అవమానకరంగా మాట్లాడు తున్నాడని, ఎప్పుడు వస్తాడో ఎప్పుడు పోతాడో కూడా తెలియని పరిస్థితి ఉందని విద్యార్థులు వాపోయారు. విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. “పలుమార్లు భోజనం సరిగా పెట్టాలని అడిగితే, ఉంటే ఉండండి లేకపోతే మీ ఇళ్ళకి వెళ్ళండి అనే సమాధానం చెబుతున్నాడు. ఇలాంటి నిర్లక్ష్య ధోరణి వసతి గృహంలో ఉండకూడదు. ఇలాంటి వార్డెన్లు ఉండడం వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుంది” అని వారు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రభుత్వ అధికారులను విజ్ఞప్తి చేస్తూ – “ఇకనైనా సంబంధిత అధికారులు వెంటనే వసతి గృహాన్ని సందర్శించి, అవసరమైన సదుపాయాలు కల్పించి, విద్యార్థులకు న్యాయం చేయాలి” అని డిమాండ్ చేశారు. వసతి గృహంలో జరుగుతున్న ఈ నిర్లక్ష్యాన్ని పట్టించుకుని, అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# అంగరంగ వైభవంగా వినాయక విగ్రహ నిమజ్జనోత్సవం

**- రూ 2 లక్షల రూ.40 వేల పలికిన లడ్డు వేలం పాట**



**నాయుడుపేట- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 4:** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని నాయుడుపేట పట్టణంలోని దర్గా రోడ్ లో నాయుడుపేట వినాయక చవితి కమిటీ సభ్యులు, ఎస్. జె.జువెలరీస్ అధినేత,టిడిపి నేత పొట్లపూడి రాజేష్,స్థానిక వ్యాపారుల ఆధ్వర్యంలో భారీ సినిమా సెట్టింగులతో శోభాయమానంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద గత తొమ్మిది రోజులుగా అత్యంత వైభవంగా పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం గురువారం అంగరంగ వైభవంగా నిమజ్జనోత్సవ కార్యక్రమం నిర్వహించారు. నెల్లూరు, తిరుపతి నగరాలకు దీటుగా వినూత్న రీతిలో భారీ సినిమా సెట్టింగులతో దర్గా రోడ్ లో ఏర్పాటు చేసిన 22 అడుగుల వినాయక విగ్రహం వద్ద ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయ శ్రీ, పార్థసారథి దంపతులు,మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, డీఎస్పీ చెంచు బాబు సిఐ బాబి ల తోపాటు వేలాదిమంది ప్రజలు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వాదాలు పొందారు.అనంతరం నాయుడుపేట వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గురువారం వినాయక స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. బాణాసంచా వేడుకలు,సాంస్కృతిక కార్యక్రమాల నడుమ స్వామి వారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్ పై ఉంచి గూడూరు పట్టణ సమీపంలోని పంపలేరులో నిమజ్జనానికి తరలించారు.ఈ కార్యక్రమంలో వేలాది మంది ప్రజలు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో నాయుడుపేట వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు భారతాల సాయిరామ్ కిషోర్,గోనుపల్లి గురుమూర్తి, బల్లి కుమార్,అవుల సుధాకర్ బయ్యా రమేష్, బయ్యా రామారావు,దేవత గోపి,శంకర్లాల్,సొల్లేటి రమేష్, చింతం రెడ్డి మురళి,స్టాలిన్, డిటిడిసి సురేష్, వెంకయ్య, నజీర్,దయాకర్ సత్య,రామకృష్ణ, రాఘవ, మధు, మౌనేష్, సొల్లేటి మోహన్ పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# అరాచక శక్తులకు ధర్మవరంలో చోటు లేదు

**-మంత్రి సత్యకుమార్ యాదవ్ కఠిన హెచ్చరిక**
**- హత్య ఘటనపై మంత్రి ఆగ్రహం**
**- పోలీసులకు కఠిన ఆదేశాలు**
**- ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు**





**ధర్మవరం - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 04:** ధర్మవరంలో గురువారం సాయంత్రం చోటుచేసుకున్న ఘోర హత్యా ఘటన స్థానికంగా కలకలం రేపింది. కేతిరెడ్డి కాలనీకి చెందిన తలారి లోకేంద్ర (మృతుడు), అనేక క్రిమినల్ కేసుల్లో నిందితుడిగా, ధర్మవరం టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్‌గా నమోదు అయ్యాడు. అతని మీద గతంలో ఒక మహిళా హత్య కేసుతో పాటు మరొక హత్య కేసు సహా పలు క్రిమినల్ కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.ఈ రోజు జరిగిన ఘటనలో, గతంలో లోకేంద్ర చేతిలో ప్రాణాలు కోల్పోయిన శ్రీనివాసులరెడ్డి కుమారుడు బాలకృష్ణరెడ్డి, ప్రతీకారం తీర్చుకోవాలనే ఉద్దేశ్యంతో లోకేంద్రపై దాడి చేసి హత్య చేసినట్లు ప్రాథమిక సమాచారం. ఘటన చోటుచేసుకున్న వెంటనే మంత్రి నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం, ఈ విషయం పై వెంటనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌కి , పోలీస్ ఉన్నతాధి.కారులకు సమాచారం అందజేశారు. ఈ ఘోర ఘటనపై మంత్రి సత్య కుమార్ యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్మవరం పట్టణంలో అరాచక శక్తులకు అస్సలు చోటు ఇవ్వబోమని మంత్రి స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు మరల జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ధర్మవరం పోలీస్ అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రజల భద్రతకు విఘాతం కలిగించే ఎవరికైనా ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. ధర్మవరం పట్టణ ప్రజల్లో ఈ ఘటన ఆందోళన కలిగించిన ప్పటికీ, పోలీస్ అధికారులు తక్షణమే రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన వెనుక ఎవరు ఉన్నా వారిని వదిలిపెట్టబోమని, పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి నిజానిజాలు వెలికితీస్తామని పోలీసులు హామీ ఇచ్చారు.

## మతసామరస్యం మన నినాదం... రక్తదానం మన విధానం

**- అనంత రెడ్ డ్రాప్స్ చారిటబుల్ ట్రస్ట్, ఏం.ఎస్ ఆర్గనైజేషన్**



**అనంతపురం - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 4:** మతసామరస్యం మన నినాదం రక్తదానం మన విధానం అంటూ అనంత రెడ్ డ్రాప్స్ చారిటబుల్ ట్రస్ట్ ఏం ఎస్ ఆర్గనైజషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సౌజన్యంతో ఈద్ మీలాద్ ఉన్ నబి మహమ్మద్ ప్రవక్త 1500వ జన్మదిన వేడుకలలో భాగంగా మసుమాబి దర్గా మల్దార్ స్ట్రీట్ లో రక్తదాన శిబిరం నిర్వహించడం జరిగింది. దాదాపు 45మంది మానవత్వంతో తమ విలువైన రక్తాన్ని దానం చేసారు.ఈ కార్యక్రమనికి ముఖ్య అతిధులుగా 1టౌన్ సిఐ వెంకటేశ్వర్లు పాల్గొని త్యాగాలకు ప్రతీక ఇస్లాం అని, నిజమైన బోధకుడు, గురువు, మానవహక్కుల నేత మహమ్మద్ ప్రవక్తఅని కొనియాడారు. ఈ కార్యక్రమం లో ఏం.ఎస్ ఆర్గనైజషన్ అధ్యక్షులు కాలేషా ,అనంత రెడ్ డ్రాప్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సర్దార్ వలి ,లీగల్ అడ్వైజర్ త్యాగ రాజు , సహాయ కార్యదర్శులు దాదు,బాబా అలి, మొహమ్మద్ గార్లు,సభ్యులు శిక్షావలి, కే మహబూబ్ బాషా, ఖాజా, ముస్తఫా, దాదా పీర్, నవాజ్, బన్నీ, అర్షద్, అస్లాం భాష, అరటి తాహిర్, ముఖేష్ కుమార్ వలిగార్లు ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది మూర్తి ,భాస్కర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## బైక్ దొంగల బృందానికి పోలీసులు బిగుసుకట్టారు

**- రెండు బైకులు స్వాధీనం - కోర్టు రిమాండ్**



**నాయుడుపేట- సూర్యా వాస్తవం, సెప్టెంబర్ 04:** నాయుడుపేట పట్టణంలో వరుసగా జరుగుతున్న బైక్ దొంగతనాలకు చెక్ పెడుతూ పట్టణ పోలీసులు మరోసారి తమ కఠినతను చాటారు. గురువారం సాయంత్రం మల్లాం జంక్షన్ సమీపంలో జాగ్రత్తగా పొంచి ఉన్న పోలీసులు, బైకులను దొంగిలిస్తూ వస్తున్న ఇద్దరిని పట్టుకున్నారు. పట్టణ సీఐ బాబి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆపరేషన్ స్థానిక ప్రజల్లో చర్చనీయాంశమైంది. అరెస్టు చేసిన వారిని నాగముంతల మణికంఠ (నాయుడుపేట) మరియు శ్రావణ్ కుమార్ (పెళ్లకూరు)గా గుర్తించారు. వీరు కొంతకాలంగా పట్టణ పరిధిలో బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. దొంగల వద్ద నుండి రెండు మోటార్ బైకులు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.తరువాత నిందితులను నాయుడుపేట కోర్టులో హాజరుపరచగా, జడ్జి రిమాండ్ విధించారు. పోలీసులు వీరి గత చరిత్రను కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం.పట్టణ ప్రజలు పోలీసుల కఠిన చర్యలను అభినందిస్తూ, “బైక్ దొంగల ముఠాలను ఇలాగే బిగుసుకట్టాలని, నేరాలను అరికట్టాలని” విజ్ఞప్తి చేశారు. నాయుడుపేట పరిసర ప్రాంతాల్లో భద్రతా చర్యలు మరింత బలపరిచే దిశగా పోలీసులు ముందుకు సాగుతున్నారని తెలిసింది.

## వీబీఆర్ పాఠశాలలో కరస్పాండెంట్ సుభాన్ దంపతులు ఘన సత్కారం



**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 4:** సెప్టెంబర్ 5వ తేదీ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా... దేవనకొండ లోని వి.బి.ఆర్ పాఠశాలలో కరస్పాండెంట్ సుభాన్ దంపతులు ఉపాధ్యాయులకు ఘనంగా సత్కరించి నూతన వస్త్రాలను కానుకగా సమర్పించారు. ఈ కార్యక్రమంలో సుభాన్ మాట్లాడుతూ.... ఉపాధ్యాయ వృత్తి అంటే ఎంతో ఇష్టమని ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం కోసం పలుమార్లు ప్రయత్నించి జిల్లా టాప్ ర్యాంకులు సాధించినప్పటికీ ఫలితం దక్కనందున 2016లో విబిఆర్ స్కూల్ స్థాపించి ఉపాధ్యాయులుగా పనిచేస్తూ సంతృప్తి పొందుతున్నామన్నారు.ప్రస్తుతం 2025 మెగా డీఎస్సీలో స్కూల్ కరస్పాండెంట్ సుభాన్ మరియు భార్య షేక్ యాస్మిన్ స్కూల్ అసిస్టెంట్ హిందీ ఉద్యోగాన్ని పొందడం జరిగినది. ఈ ఉద్యోగ సాధనలో ఎంతో కష్టపడాల్సి వచ్చింది అని దంపతులిద్దరూ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సుభాన్, సతీమణి యాస్మిన్ ను పాఠశాల సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరీష్, మనోహర్ ,గోవర్ధన్, ప్రశాంత్, యాస్మిన్, అనసూయ ,మౌనిక, అరుణ, శైలజ ,ఝాన్సీ ,రాధా పాల్గొన్నారు.

## ఐసీడీఎస్‌లో విషాదం

**- సీనియర్ అసిస్టెంట్ ఫర్హాన ఇక లేరు**



**అనంతపురం - సూర్య వాస్తవం , సెప్టెంబర్ 4:** ఉమ్మడి అనంతపురం జిల్లా ఐసీడీఎస్ శాఖలో విషాదం నెలకొంది. ఆ శాఖ సీనియర్ అసిస్టెంట్ ఫర్హాన గురువారం రాత్రి తుదిశ్వాస వదిలారు. ఆమెకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కొంతకాలం కిందట క్యాన్సర్ వ్యాధి బారిన పడ్డ ఆమె చావు అంచుల దాకా వెళ్లొచ్చారు. కుటుంబ సభ్యులు మెరుగైన వైద్య చికిత్స చేయించడంతో కోలుకున్నారు. యథావిధిగా విధులకు హాజరయ్యేవారు. అనంతపురం ఐసీడీఎస్ పీడీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తుండగా.. సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి వచ్చింది. శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌కు పదోన్నతిపై వెళ్లారు. అయితే ఆమెకు తిరిగి క్యాన్సర్ వ్యాధి తిరగబెట్టింది. మృత్యువుతో పోరాడ లేక ఓడిపోయారు. చిన్న వయసులోనే కానిస్టేబుల్‌తో పెళ్లై, ఆమెకు ముగ్గురు పిల్లలు పుట్టారు. అంతలోనే భర్తను కోల్పోయిన ఫర్హాన.. కారుణ్య నియామకం కింద ఐసీడీఎస్ లో ఉద్యోగ జీవితం ప్రారంభించారు.విధి నిర్వహణలో నిజాయతీ, నియబద్ధత, క్రమశిక్షణ కలిగిన ఫర్హాన అందరి అభిమానాన్ని చూరగొన్నారు. కరోనా సమయంలో గర్భవతిగా ఉన్న పెద్ద కుమార్తెను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో మునిగి పోయారు. ఆ బాధ నుంచి కోలుకోకనే ఆమె తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. ఆస్పత్రికి తరలించగా క్యాన్సర్ అని తేలింది. కుటుంబ సభ్యులు ఎంతో శ్రమ తీసుకొని ఆమెకు మెరుగైన వైద్య సేవలు అందించారు. కోలుకున్నట్లే కోలుకొని.. అంతలోనే మళ్లీ అనారోగ్యానికి గురయ్యారు. ఆమెను బతికించాలని వైద్యులు ఎంత శ్రమించినా ఫలితం లేకపోయింది. చివరకు ఫర్హాన ఈ లోకం నుంచి నిష్క్రమించారు. విషయం తెలిసిన వెంటనే శ్రీ సత్యసాయి జిల్లా, అనంతపురం ఐసీడీఎస్ పీడీలు ప్రమీల, మల్లెపోగు నాగమణి, సీనియర్ అసిస్టెంట్ బాబా నూరుద్దీన్ సహా ఆ శాఖ ఉద్యోగులు విషాదంలో మునిగిపోయారు. ఫర్హాన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం నమాజు తరువాత ఫర్హాన అంత్యక్రియలు అనంతపురంలో జరగనున్నట్లు తెలిసింది.

సూర్య వాస్తవం Truth of News http://www.suryavastavam.in



### నేతన్న కుటుంబానికి నెలకు 200 మరమగ్గాలకు

# 500 యూనిట్ల ఉచిత విద్యుత్

## - మంత్రి ఎస్. సవిత

**విజయవాడ-సూర్య వాస్తవం, సెప్టెంబర్ 4:** దేశంలో అన్ని ప్రాంతాల నుంచి విభిన్న రకాల చేనేత వస్త్రాలను నగర ప్రజలకు అందుబాటులో ఉండేలా చేనేత మరియు హస్తకళల ప్రదర్శనలో ఏర్పాటు చేయడం జరిగిందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ ల మంత్రి ఎస్. సవిత తెలిపారు. నగరంలో శ్రీ శేష సాయి కళ్యాణ వేదికలో ఏర్పాటు చేసిన "గాంధీ బునకర్ మేళా" (జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన - 2025) ను గురువారం మంత్రి ఎస్. సవిత, ఆంధ్రప్రదేశ్ గౌడ సంక్షేమ మరియు అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి ఎస్. సవిత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాకతో చేనేతకు మహర్దశ ప్రారంభమైందన్నారు. నేతన్నల అభివృద్ధికి సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే, మరోవైపు చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాన్ని ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. రాష్ట్రంలోనూ, జాతీయ స్థాయిలోనూ చేనేత బజార్లు ఏర్పాటు చేయిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి నేతన్నలను ఆదుకునేలా వివిధ కార్యక్రమాలను



నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా ప్రతి నెలా చేనేత, హస్తకళల అభివృద్ధికి ఎగ్జిబిషన్స్ ను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా తయారీదారులే ప్రత్యక్షంగా చేనేత ఉత్పత్తులను అమ్ముకునే విధంగా ఎగ్జిబిషన్స్ ఏర్పాటు చేయడం వల్ల వినియోగదారులకు తక్కువ ధరలకే చేనేత వస్త్రాలు లభిస్తాయన్నారు. స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి ఎన్.టీ రామారావు దగ్గర నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వరకు చేనేతకు ఆదరణ కల్పించేందుకు కృషి చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం చెప్పిన మాట ప్రకారం నేతన్నలకు నెలకు రూ. 4,000 పెన్షన్ ను అందిస్తున్నామన్నారు. నేతన్నలను ఆదరించేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి ప్రతి వారం చేనేతను ధరిస్తు న్నారన్నారు. దీనివల్ల చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ పెరిగి, నేతన్నల్లో ధైర్యంతోపాటు ఆర్థిక భరోసా లభిస్తోందన్నారు. ప్రతి నేతన్న కుటుంబానికి నెలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకూ విద్యుత్తును ఉచితంగా అందిస్తున్నామన్నారు. చేనేత ఉత్పత్తులపై నేతన్నలకు వీవర్ కార్డులు అంది స్తున్నామని, దీనివల్ల చేనేత ఉత్పత్తుల తయారీ తెలుసు కోవచ్చున్నారు. యువత, మహిళలు, చిన్న పిల్లలను ఆకట్టుకనేలా అన్ని వర్గాల వారిని ఆకట్టుకునేలా చేనేత దుస్తులను ఆన్ లైన్ లో ఉంచటంతోపాటు, డిజిటల్ ఫ్లాట్ ఫామ్స్ ద్వారా అమ్మకాలు చేస్తున్నామన్నారు.



### హెచ్ఐవి, ఎయిడ్స్‌పై

# యువతీ యువకులకు అవగాహన అవసరం

## - అడిషనల్ డీఎమ్ హెచ్ఓ డా. రమేష్ బాబు

**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం, సెప్టెంబర్ 04:** జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆద్వర్యంలో యూత్ ఫెస్ట్ 2025-26లో బాగంగా గురువారం 5కె రెడ్ రన్ మార థాన్‌కి ముఖ్యఅథితిగా జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్, శ్రీ భాస్కర్ వేంపల్లె, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ ఆఫీసర్, గౌస్ భాష, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ డా ఎం. మునియ నాయక్, యు పి హెచ్ సి మెడికల్ ఆఫీసర్ డా.నవీన్ పచ్చజెండా ఊపి ప్రారంబించారు.ఈ 5 కె రెడ్ రన్ మారథాన్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ నుంచి ప్రారంభమై చిత్తూరు రింగ్ రోడ్డు సర్కిల్ మీదుగా నారాయణ రెడ్డి పల్లె దగ్గర యు టర్న్ తీసుకొని తిరిగి గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ చేరుకుంది. ఈ మారథాన్ లో వివిద కళాశాలలకి చెందిన 150 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్బంగా అడిషనల్ డి ఎమ్ హెచ్ ఓ డా. . రమేష్ బాబుమాట్లాడుతూ యువతీయువకులు హెచ్ఐవి /ఎయిడ్స్ పై అవగాహన కలిగిఉండాలని అలాగే తమ మిత్రులకు, కుంటుంబ సభ్యులకు హెచ్ఐవి ఎయిడ్స్ పై అవగాహన కలిగించాలి అని తెలిపారు.క్లస్టర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీ భాస్కర్ వేంపల్లె మాట్లాడుతూ... హెచ్ఐవి ఎయిడ్స్ వ్యక్తుల పట్ల వివక్ష చూపకూడదని వారి పట్ల ప్రేమ,అబిమానాలు కలిగి ఉండాలని తెలియజేశారు. డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ ఆఫీసర్ గౌస్ భాష, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ ఎం. మునియ నాయక్ మాట్లాడుతూ




హెచ్ఐవి ఎయిడ్స్‌కి చికిత్స ఉన్నదని దీనిపై అనుమానాలు ఉంటే ప్రభుత్వ ఆసు పత్రులలో ఉచిత పరీక్షలు చేయించు కోవచ్చు అని తెలిపారు. అలాగే హెచ్ఐవి ఉన్న వ్యక్తులు ఎటువంటి బయం లేకుండా ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచిత మందులు తీసుకోవాలని తెలిపారు .ఈ 5 కె రెడ్ రన్ మారథాన్‌లో అబ్బాయిల విబాగంలో మొదటి బహుమతి ఎం. నాని (గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, రైల్వే కోడూరు), రెండవ బహుమతి యస్ .అబ్దుల్ రెహ్మాన్ ( గవర్నమెంట్ జూనియర్ కాలేజ్, రాయచోటి) గెలుపొందడం జరిగినది. అమ్మాయిల విబాగంలో మొదటి బహుమతి యస్. ఫిర్దోస్ భాను(వుమెన్ డిగ్రీ కాలేజ్, రాయచోటి), రెండవ బహుమతి కె. ఐశ్వర్య ( వుమెన్ డిగ్రీ కాలేజ్, రాయచోటి) గెలుపొందారు . ట్రాన్స్ జెండర్స్ విబాగంలో మొదటి బహుమతి వి.తేజమని( బి.టి. కాలేజ్, మదనపల్లి), రెండవ బహుమతి సీ.వరప్రసాద్( బి.టి. కాలేజ్, మదనపల్లి) గెలుపొందారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నివారణాదికారి డా. యు పి హెచ్ సి మెడికల్ ఆఫీసర్ డా. . నవీన్ మాట్లాడుతూ... యువత ఆరోగ్యంగా జీవిస్తూ , జీవన నైపుణ్యాలు కలిగి హెచ్ఐవి ఎయిడ్స్ , మాదక ద్రవ్యాలకు, సుఖ వ్యాదులకి దూరంగా ఉండి తమ లక్ష్యాలను చేరుకోవాలని తెలిపారు. క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ వి. భాస్కర్ మాట్లాడుతూ...విజేతలని అబినం దిస్తూ ఈ మారథాన్‌లో మొదటి ,ద్వితీయ బహుమతి పొందిన విద్యార్థినీ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో సెప్టెం బరులో జరిగే మారథాన్‌లో పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమలో గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ కాలేజీ ప్రిన్సిపల్ డా.ఎం.మునియనాయక్, జిల్లాక్రీడాశా ఖాదికారి గౌస్‌భాష, రెడ్ రిబ్బన్ సమన్వయ కర్తలు డా. బొమ్మల వెంకటరావు, విశ్వ ప్రసాద్, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఖాజా వైస్ కిరణి, గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ జబీ ఉల్ల, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అదికారులు సాదిక్, పి సి యస్ యస్ యన్ జి ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి చెన్నారెడ్డి, వారి సిబ్బంది, ఐసీటీసీ స్టాఫ్ నర్స్ మధుబాబు,లాబ్ టెక్నీషియన్ శంకర్, లింక్ వర్కర్ అల్లవల్లి, వారి సిబ్బంది, వైద్య ఆరోగ్యశాఖ, వివిద కళాశాలల ఆద్యాపకులు, జిల్లా స్పోర్ట్ విబాగానికి చెందిన శిక్షణ అధికారులు పాల్గొన్నారు.



# ఏపీపీఎస్సీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

## - డీఆర్ఓ ఏ.మలోల




**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 04** : ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించే ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అండ్ అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, ఫారెస్ట్ సబార్డినేట్ సర్వీస్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డిఆర్ఓ ఏ.మలోల ఆదేశించారు. గురువారం అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస కమిషన్(ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో నిర్వహించే ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అండ్ అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, ఫారెస్ట్ సబార్డినేట్ సర్వీస్‌కు సంబంధించిన పరీక్షలపై డిఆర్ఓ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ ఈనెల 7వ తేదీన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అండ్ అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, ఫారెస్ట్ సబార్డినేట్ సర్వీస్ మరియు ఏపీ ఫారెస్ట్ సబార్డినేట్ సర్వీస్‌లో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టుల నియామకాలకు ఆఫ్-లైన్ మోడ్, ఓ ఏం ఆర్ ఆధారిత (ఆబ్జెక్టివ్ టైప్) స్క్రీనింగ్ టెస్ట్ పరీక్షలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆదివారం ఉదయం 10.00 నుండి మధ్యాహ్నం 12.30 వరకు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ - అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ పరీక్షలు, మధ్యాహ్నం 03.00 నుండి సాయంత్రం 5.30 వరకు ఫారెస్ట్ సెక్షన్



ఆఫీసర్ పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 18 వెన్యూ కేంద్రాలలో నిర్వహించే పరీక్షలలో ఉదయం సెషన్‌లో 7,221 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 1,314 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. ఈ పరీక్షల కోసం 18 మంది లైజన్ అధికారులుగా నియమించడం జరిగిందని, ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. పరీక్ష కేంద్రాలలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కార్యకలాపాలకు తావు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. అధికారులు, పోలీసు యంత్రాంగం సమన్వయంతో పనిచేసి పరీక్షలను సజావుగా, ఎలాంటి ఇబ్బందులకి తావివ్వకుండా జరిగేలా చూడాలని సూచించారు. పోలీసు శాఖ ప్రతి సెంటర్లో బందోబస్తును ఏర్పాటు చేయాలన్నారు.ఈ సమావేశంలో ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ ఏ. వెంకటసుబ్బయ్య, సెక్షన్ ఆఫీసర్లు భోగేశ్వరి, పద్మప్రియ, లైజన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ప్రిన్సిపాల్‌గా రమేష్




**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 4:** లక్కిరెడ్డిపల్లి ఏపీ మోడల్ స్కూల్లో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న వర్ల రమేష్ ఉత్తమ ప్రిన్సిపాల్‌గా ఎంపికయ్యారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదినంను పురస్కరించుకొని రాయచోటి అన్నమయ్య జిల్లాలో కలెక్టర్ చామకూరి శ్రీధర్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి డిఇఓ సుబ్రమణ్యం చేతుల మీదుగా ఉత్తమ ప్రిన్సిపాల్ పురస్కార అవార్డును అందుకో బోతున్నారు. చిన్నమండెం ఏపీ మోడల్ స్కూల్లో ప్రిన్సిపాల్‌గా పనిచేసి పాఠశాల అభివృద్ధి విద్యార్థుల్లో ఉత్తమ ఫలితాలు సత్ప్రవర్తన కలిగింపజేసిన ప్రిన్సిపల్ రమేష్ సేవలు గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ప్రిన్సిపాల్ గా పురస్కార్ అవార్డు అందిస్తుంది. అలాగే ఏపీ మోడల్ స్కూల్లో జువాలజీ పిజిటి రాజశేఖర్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఈయన కూడా మొదటిగా లక్కిరెడ్డిపల్లె ఏపీ మోడల్ స్కూల్ ఏపీఎస్సీ ప్రిన్సిపల్‌గా పనిచేసి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి నుంచి మంచి మన్ననలు అందుకొని విద్యార్థులను సత్ప్రవర్తన కలిగిన విద్యార్థులుగా తీర్చి దిద్దారు. ఈయన సేవలు గుర్తించి ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయుడిగా నేడు అన్న మయ్య జిల్లాలో పురస్కార్ అవార్డు అందుకోబోతున్నారు వీరి ఎంపిక పట్ల అన్నమయ్య జిల్లా ఏపీ మోడల్ స్కూల్ ప్రి ప్రిన్సిపల్స్ అధ్యాపకులు ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

# ఘనంగా గణనాధుని నిమజ్జనం



**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం,సెప్టెంబర్ 4:** వినాయక చవితి పురస్కరించుకొని లక్కిరెడ్డిపల్లి మూడు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన 15 అడుగుల వినాయక విగ్రహాన్ని గురువారం అత్యంత వైభవంగా నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నవరాత్రులు వినాయకుడి పూజలు నిర్వహించి ప్రతిరోజు రాత్రి వేళల్లో హరికథలు సాసవల చిన్నమ్మ కథ బ్రహ్మంగారి జీవిత చరిత్ర డ్రామా నృత్య ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రతిరోజు మధ్యాహ్నవేళలో దాతలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.బట్టల షాప్ ధన కుమార్ చివరి రోజున వినాయకుని సన్నిధిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పురవీధులలో చెక్కభజనలు కోలాటాల మధ్య ఊరేగింపు చేసి సమీపంలోని దొరి చెరువులో నిమజ్జనం చేశారు. కార్యనిర్వాహకులు వెంకటరమణ, విగ్రహ దాత గురు స్వామి వెంకటరమణ,యువకులు తదితరులు పాల్గొన్నారు.

### నేడు కోనంపేటలో

# మెగా ఉచిత వైద్య శిబిరం

**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం,సెప్టెంబర్ 4:** తిరుపతి రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి సౌజన్యంతో కోణంపేట సర్పంచ్ లక్ష్మీనారాయణ ఆధ్వరంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచు లక్ష్మీనారాయణ తెలిపారు. చక్రాయపేట, లక్కిరెడ్డిపల్లి ,గాలివీడు మండలాలకు చెందిన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చున్నారు.కోణంపేటలోని శ్రీ కోదండరామ స్వామి దేవస్థానం ఆవరణంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారని ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన

## డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ బి.గీతా వాణి





**చెన్నూరు-సూర్య వాస్తవం, సెప్టెంబర్ 4:** మండలంలోని ఎరువుల దుకాణాలను విజిలెన్స్ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ బి.గీతా వాణి గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మండలంలోని తిరుగు దుకాణాలను తనిఖీ చేసి ఎరువుల స్టాక్ వివరాలను డీలర్లను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు ఎరువులను విక్రయిస్తున్నారా లేదా అని వారిని అడగడం జరిగింది. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే రైతులకు చెరువులను విక్రయించడం జరుగుతుందని వారు తెలిపారు. అలాగే రైతు సేవ కేంద్రాలలో యూరియా పంపిణీ విధానాన్ని ఆమె పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐ ఎం.కృష్ణారెడ్డి, మండల వ్యవసాయ అధికారి కె. శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )